Follow: @ANNTELUGU
28-07-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 234 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

కేటీఆర్.. ఇడియట్ మాటలు
## బంద్ చెయ్
- బుడంకాయ, వంకాయగాళ్లు ఏమీ చేయలేరు
- వంద మంది కేసీఆర్‌లు వచ్చినా బీఆర్ఎస్ బతకాదు
- మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్



02

తెలంగాణ బీజేపీకి రైటర్ కాదు
## ఫైటర్ కావాలి
- హోంశాఖ మంత్రి అమిత్ షా నాకు ఫోన్ చేయలేదు
- కొంతమంది బీజేపీ మహిళానేతలకు దండం.. వారికి సన్మానం చేస్తా
- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



02

యూరియా సరఫరాలో కేంద్రం
## తీవ్ర నిర్లక్ష్యం
- కేంద్రం ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉంది
- ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దు
- కేంద్ర ప్రభుత్వంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపాటు



02

SRI GOLD
TRUSTED GOLD BUYERS

బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 99,930 |
| 22 క్యారెట్ | 91,600 |
| సిల్వర్ (కేజీ) | 1,16,000 |

# ఎదురులేని కాంగ్రెస్

## బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పాలనే మెరుగంటున్న పబ్లిక్


కాంగ్రెస్ బాగుంది 66 శాతం
బీఆర్ఎస్ బాగుంది 30 శాతం
పథకాలలో సన్నబియ్యానికి టాప్ ర్యాంక్
సీఎం రేవంత్ సమర్ధతకు ప్రశంసలు
ఎఎన్ఎన్ మహా పోల్ లో తేల్చిచెప్పిన జనం

*"రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన గత బీఆర్ఎస్ పరిపాలన కంటే మెరుగ్గా ఉందని ప్రజలు తేల్చిచెబుతున్నారు. ఎఎన్ఎన్ - మహా పోల్ లో 22 వేలమంది ప్రజలు పాల్గొని ఎవరిపాలన బాగుందన్న ప్రశ్నకు 66శాతం మంది కాంగ్రెస్ పాలన బాగుందని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్ధుడని, ధైర్యవంతుడని ప్రజలు అభిప్రాయపడ్డారు.*

*- మహా, ప్రత్యేకం*



## ఎవరి పాలన బాగుంది?




- కాంగ్రెస్ బాగుంది
- బీఆర్ఎస్ బాగుంది
- ఇద్దరిదీ నచ్చలేదు

02




## డేట్, టైం ఫిక్స్ చెయ్..
# సీఎం రమేష్‌ను తీసుకొస్తా
### విలీన ప్రతిపాదన నిజం.. చర్చకు దమ్ముందా?
### కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్

**హైదరాబాద్, మహా :** సోషల్ మీడియా ద్వారా ప్రధాని సహా బీజేపీ నేతలపై బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. ఇకపై తప్పుడుప్రచారం చేస్తే అంతు చూస్తామని.. తమ కార్యకర్తలు ఎక్కడికక్కడ అడ్డుకుంటారని.. ఖబడ్దార్ కేటీఆర్ అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై సీఎం రమేశ్ చెప్పింది నిజమే దమ్ము కేటీఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు. డేట్, టైం ఫిక్స్ చేసి చర్చకు రావాలని ఆయనకు సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని ప్రారం భించిన అనంతరం బండి మీడియాతో మాట్లాడారు. 'సీఎం రమేష్ ను రప్పించి వేదిక ఏర్పాటు చేయిస్త. బహిరంగ చర్చకు తేదీ, సమయం కేటీఆర్ చెప్పాలి. కుటుంబ, వారసత్వ పార్టీలకు బీజేపీ దూరం. ప్రధాని మోదీ కూడా నిజామాబాద్ సభలో ఇదే చెప్పారు. అవినీతి, కుటుంబ పార్టీ అయిన బీఆర్ఎస్ ను విలీనం చేసుకునే ప్రసక్తే లేదు. రాష్ట్రం లో వాళ్ల పనైపోయింది. ఆ పార్టీని నడపలేక కేసీఆర్ చేతులెత్తేశా రు. బీఆర్ఎస్‌దర్లు పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయా రు. ఆ ఆక్రోశంతోనే కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. సీఎంను తిడుతున్నా స్పందించలేని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలు' అంటూ మండిపడ్డారు.

కామారెడ్డిది బీసీ డిక్లరేషన్ కాదు..
# ముస్లిం డిక్లరేషన్
## బీసీ రిజర్వేషన్ల బిల్లు అడ్డుకుంటాం
బంజారాహిల్స్ ఆలయాన్ని కూల్చే అవసరమేంటి?
కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

03



# పార్లమెంట్‌లో చర్చకు రెడీ

**ఢిల్లీ:** పార్లమెంట్‌లో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి లోక్‌సభలో, మంగళవారం నుంచి రాజ్యసభలో చర్చ జరగనుంది. ఈ అంశంపై ఉభయసభల్లో చెరో 16 గంటలు కేటాయించారు.

మిగతా 2లో

# సికింద్రాబాద్ సృష్టి ఆస్పత్రి అక్రమాలు
## డాక్టర్ నమ్రత ఆమె కుమారుడు జయంత్ కృష్ణ సహా 8 మంది అరెస్ట్..
సికింద్రాబాద్, విశాఖలో దారుణాలు.. తవ్విన కొద్దీ వెలుగు చూస్తున్న ఘోరాలు
వివరాలు వెల్లడించిన డీసీపీ రశ్మి పెరుమాళ్

వివరాలు 2లో

స్టాక్ మార్కెట్

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 81,463.09 |
| నిఫ్టీ | ↗ | 24,837 |

ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 4.25 | 127.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 4.8 | 127.5 |
| రిటైల్ గుడ్డు ధర | 4.51 | 135.15 |

సామాజిక న్యాయం పాటిస్తాం...
# బీసీలకు ఎక్కువ సీట్లిస్తాం
బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే ఈ ప్రభుత్వం సెట్ రైట్ అయితది
పరకాల, భూపాలపల్లి సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హన్మకొండ, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని అత్యధికి మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కోరారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సామాజిక న్యాయం పాటించిందని.. ఈసారి జరిగే ఎన్నికల్లో సామాజిక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 3లో



## ఎంపీ సీఎం రమేష్ వ్యాఖ్యలపై స్పందించను!
- మామునూరు ఎయిర్ పోర్ట్‌కు రాణిరుద్రమ పేరు పెట్టాలి
- ఢిల్లీకి వెళ్లడం సీఎం రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

02



# ఆదిలాబాద్‌లో కదం తొక్కిన ఆదివాసీలు
- రాజ్ గోండు సేవా సమితి ఆధ్వర్యంలో మెగా ర్యాలీ
- రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపూరావు బాధ్యతల స్వీకరణ
- సమావేశంలో పాల్గొన్న వెడ్మబొజ్జు, కంది శ్రీనివాసరెడ్డి, గజేందర్
- ఆదివాసీల సంక్షేమానికి పోరాడుతా- సోయం బాపూరావు



**ఆదిలాబాద్, మహా:** ఆదివాసుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని ఎస్టీయూ భవన్ లో ఆదివారం రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సోయం బాపురావు ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు పట్టణంలో సంప్రదాయబద్ధంగా మెగా ర్యాలీ నిర్వహించారు. కొమ్ముబూరలు, డప్పుచప్పుల్లతో ఆదిలాబాద్ పట్టణంలో అదరగొట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో తాను వేరే పార్టీలో ఉన్నప్పటికి మరో పార్టీ నుంచి పోటీ చేసిన బొజ్జు పటేల్ గెలవాలని కోరుకున్నానని చెప్పారు. తనకు,మాజీ ఎమ్మెల్యే సక్కుకు టికెట్ సమస్య వచ్చినప్పుడు ఆయనకే ఇవ్వాలని సూచించానని పేర్కొన్నారు.

మిగతా 2లో

# ఎదురులేని కాంగ్రెస్

(మహా ప్రత్యేకం)

రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన గత బీఆర్ఎస్ పరిపాలన కంటే మెరుగ్గా ఉందని ప్రజలు తేల్చి చెబుతున్నారు. ఎఎన్ఎన్ మహా పోల్‌లో 22 వేలమంది ప్రజలు పాల్గొని ఎవరిపాలన బాగుందన్న ప్రశ్నకు 66శాతం మంది కాంగ్రెస్ పాలన బాగుందని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్ధుడని, ధైర్యవంతుడని ప్రజలు అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం ఇస్తున్నాడు.. రేషన్ కార్డు ఇస్తున్నాడు బీదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నారు. ఫ్రీ బస్ మహిళలకు లోన్లు చాలా కార్యక్రమాలు చేస్తున్నాడు. 2 లక్షలు రుణమాఫీ రైతులకు 500 బోనస్ రైతులకు ఇస్తున్నాడు ఇంకా చాలా కార్యక్రమాలు చేస్తున్నాడు చేస్తాడు అంటూ పలువురు కామెంట్స్ చేయగా, ఇద్దరూ మైనారిటీల కోసం పనిచేసేవారే అని మరికొందరు అన్నారు. అన్ని పథకాలు ప్రజలకు అందుతున్నాయని, టిఆర్ఎస్ పాలనలో అంతా వాళ్ళే దోచుకుని తిన్నారని, దాచుకున్నారని.. ఇది అందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వమని మరికొందరు అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వ పథకాల్లో సన్నబియ్యం సూపర్ హిట్ అని, ర్యాంకులు ఇవ్వాల్సి వస్తే నెంబర్ వన్ ఆ పథకమే**

నని పబ్లిక్ తేల్చిచెబుతున్నారు. సన్నబియ్యం ప్రతి ఇంట్లో సంతోషం నింపిన పథకమని చెబుతున్నారు. తర్వాత మహాలక్ష్మి ఉచిత బస్సు పథకానికి జనం ఓటేస్తున్నారు. రైతుభరోసా ఫర్వాలేదని, రుణమాఫీ ఆశించిన స్థాయిలో జరగలేదని చెబుతున్నారు. ఇళ్ళపథకం కూడా గత సర్కారు కంటే మెరుగని, వచ్చిన వారికి వచ్చాయని.. రాని వారికి కూడా వస్తాయన్న ఆశ ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

**తెలంగాణ పథకాలలో ఏది బెస్ట్? దేనికి టాప్ ర్యాంక్ ఇస్తారంటే..**

సన్నబియ్యం 46శాతం
మహిళలకు ఉచిత బస్సు 26 శాతం
రైతు భరోసా 10 శాతం

మిగిలిన పథకాలకు ర్యాంకులు ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉగాదికానుకగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన సన్నబియ్యం పథకం ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చింది. ఆ తర్వాత శ్రీరామనవమికి భద్రాచలం వెళ్ళిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల తదితరులతో కలిసి లబ్దిదారుని ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. ఈ పథకం కింది వరకు వెళ్ళింది. తొలుత పెద్దగా పట్టించుకోని నేతలు కూడా గ్రామాల్లో ప్రజల్లో వ్యక్తమవుతున్న సంతోషం చూసి.. సన్నబియ్యం పథకాన్ని ఓన్ చేసుకున్నారు. కులగణన సర్వే అంశంలో తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్దితో వ్యవహరించిందని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు.

# సికింద్రాబాద్ సృష్టి ఆస్పత్రి అక్రమాలు

## డాక్టర్ నమ్రత ఆమె కుమారుడు జయంత్ కృష్ణ సహా 8 మంది అరెస్ట్..

### సికింద్రాబాద్, విశాఖలో దారుణాలు.. తవ్విన కొద్దీ వెలుగు చూస్తున్న ఘోరాలు

### వివరాలు వెల్లడించిన డీసీపీ రష్మి పెరుమాళ్

**హైదరాబాద్, మహా :** సికింద్రాబాద్ సృష్టి ఆస్పత్రి ఘటనలో మొత్తం 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సృష్టి ఆస్పత్రి డాక్టర్ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ విశాఖలోని సృష్టి ఆస్పత్రి డాక్టర్ కల్యాణి, టెక్నిషియన్ చెన్నారావుతో పాటు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఎనస్థీషియన్ సదానంద్‌లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. శిశువును విక్రయించిన మహ్మద్ అలీ షేక్ దంపతులు, అసోంకు చెందిన సంతోషిలను పోలీసులు అరెస్టు చేశారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని డీసీపీ రష్మి పెరుమాళ్ వెల్లడించారు. ఆ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరింనట్లుగా వివరించారు. సృష్టి టెస్ట్ ట్యూబ్ వ్యవహారంపై ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డీసీపీ పలు విషయాలను వెల్లడించారు. సంతానం కలగని దంపతులను సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత మోసగించినట్లుగా ఆమె వివరించారు. సంతానం కలగని దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు వెళ్లారని డీసీపీ వివరించారు. దంపతులకు డాక్టర్ నమ్రత పలు టెస్ట్‌లు నిర్వహించి ఐవీఎఫ్ సాధ్యం కాదని సరోగసీ ద్వారా బిడ్డను పొందవచ్చని చెప్పారన్నారు. రూ.30లక్షలు ఖర్చు అవుతుందని సరోగసీ కోసం విశాఖకు చెందిన దంపతులను ఒప్పించానని నమ్రత చెప్పారని రష్మి పెరుమాళ్ తెలిపారు. వారు రూ.5లక్షలు అడిగారని వెల్లడించారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నామన్నారన్నారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించారని రష్మి పెరుమాళ్ వివరించారు.

**అనుమానం వచ్చి డీఎన్ఏ టెస్ట్ చేస్తే**

కొన్నాళ్ల తర్వాత విశాఖ హాస్పిటల్‌లో ఓ బాబును దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బును అడుగుతున్నారన్నారు. డాక్టర్ అడిగిన అదనపు నగదు కూడా దంపతులు ఇచ్చారు. ఈ కేసులో నమ్రత అసలు సరోగసీనే చేయలేదు. శిశువు వద్దనుకున్న అసోంకు చెందిన ఒక మహిళకు రూ.90వేలను చెల్లించారు. ఆమెకు బిడ్డ పుట్టగానే తీసుకున్నారు. ఆ తర్వాత దంపతులకు అనుమానం వచ్చి డీఎన్ఏ టెస్టు చేయించారు. ఈ క్రమంలోనే శిశువు ఆ దంపతులకు చెందినది కాదని తేలింది'ని డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు.

**సరోగసి కాదు చైల్డ్ ట్రాఫికింగ్**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలను ఉల్లంఘించినట్లు డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. ఆ హాస్పిటల్‌కు సరైన అనుమతులు లేవని, చాలా ఫిర్యాదులు కూడా ఉన్నాయన్నారు. డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదని రష్మి పెరుమాళ్ వివరించారు. హాస్పిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్‌కు 2021లోనే గడువు తీరిందని ఆమె వెల్లడించారు.



**పోర్న్ వీడియోలు చూపిస్తూ...**

**వీర్యం దానం చేసేవారికి ఒక్కొక్కరికి రూ.5- 10 వేల వరకు ఇస్తున్నట్లు తెలిసింది. ఫోర్న్ వీడియోల చూపించి వారితో వీర్యం సేకరిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వారి ఆరోగ్య పరిస్థితితో సంబంధం లేకుండా వీర్యం దానం చేస్తున్నట్లు తెలిసింది. ఇలా సేకరించిన వీర్య కణాలు, అండాలను గుజరాత్, మధ్యప్రదేశ్‌లకు తరలిస్తున్నట్టు గుర్తించారు. అనుమతులు లేకుండానే రెజిమెంటల్ బజార్‌లో ఇండియన్ స్పెర్మ్‌టెక్ సంస్థను నిర్వహిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ పంకజ్ సోనీని నిందితుడిగా చేర్చారు. పంకజ్, సంపత్, శ్రీను, జితేందర్, శివ, మణికంఠ, బోరోలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ దందాపై పోలీసులు మరింత లోతైన విచారణ జరుపుతున్నారు.**

**ఎలా బయటపడిదంటే..?**

రాజస్థాన్‌కు చెందిన దంపతులు నాలుగేళ్లుగా సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సంతానలేమితో మూడేళ్ల క్రితం యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాన్ని సంప్రదించారు. సరోగసీ ద్వారా రూ.30 లక్షలతో పిల్లలకు అవకాశం ఉందని డాక్టర్ నమ్రత వారికి హామీ ఇచ్చారు. గతేడాది ఆగస్టులో దంపతులు మొత్తం డబ్బు చెల్లించారు. బిడ్డ జన్మించిన తర్వాత తమతో పాటు సరోగసీకి అంగీకరించిన మహిళ డీఎన్ఏ నమూనాలను సేకరించి పోల్చాలని దంపతులు షరతు విధించారు. ఈ ఏడాది బిడ్డ జన్మించింది. షరతు ప్రకారం డీఎన్ఏ పరీక్షలు చేయించాలని దంపతులు కోరగా, నమ్రత తరచు వాయిదాలు వేసింది. దీంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ఏ పరీక్షలు చేయించుకోగా, తల్లిదండ్రుల డీఎన్ఏతో బిడ్డ డీఎన్ఏ సరిపోలలేదు. జూన్ రెండోవారంలో వైద్యురాలిని సంప్రదించగా, ఆమె తప్పును అంగీకరించి సమస్యను పరిష్కరించేందుకు సమయం ఇవ్వాలని అడిగింది. కానీ తర్వాత ఆచూకీ లేకుండా పోయింది. తాము మోసపోయామని భావించిన దంపతులు గోపాలపురం పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది.

**వెలుగులోకి సంచలన విషయాలు**

యూనివర్సల్ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక మహిళ తన భర్త వీర్య కణాలతో గర్భం కావాలని.. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఆశ్రయించగా.. భర్తకు బదులుగా వేరే వ్యక్తి వీర్య కణాలతో గర్భం కలిగించినట్లు తెలిసింది. డీఎన్ఏ పరీక్షలో ఇది రుజువు కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నార్త్ జోన్ డీసీపీ సాధన లక్ష్మి పెరమల్ సారథ్యంలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు తనిఖీలు కొనసాగాయి. పోలీస్ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది పలువురి నుండి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఆసుపత్రిలో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న వైద్యశాఖ అధికారులు, ఆసుపత్రిని సీజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో, ఆసుపత్రి సిబ్బందిని మరోచోటికి తరలించారు. ఇదిలావుండగా, వీర్య కణాల అక్రమ సేకరణ గుట్టు రట్టు చేశారు. క్లినిక్ నిర్వాహకులు పోర్న్ వీడియోలు చూపిస్తూ.. వీర్య కణాలను సేకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 16 వీర్య కణాల శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకుని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారికి అప్పగించారు. నిందితులు సరోగసీ కోసం వీర్య కణాలను సేకరిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ.. ఇక్కడ సేకరించిన శాంపిల్స్‌ను అహ్మదాబాద్‌కు పంపుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల అక్రమాలు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు వెల్లడైంది. విశాఖపట్నం, విజయవాడల్లోని ఈ సంస్థ బ్రాంచీల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కోల్‌కతాలలో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలు బ్రాంచీలను నిర్వహిస్తున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ ఆసుపత్రి నిర్వాహకులపై గతంలో కేపీహెచ్‌బీ, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఓ వైద్యురాలి లైసెన్స్ రద్దు చేసినప్పటికీ, మరొక వైద్యురాలి పేరుతో అక్రమ సరోగసీ దందాను కొనసాగిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఇక ఈ ఘటన హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అక్రమ సరోగసీ, వీర్య కణాల సేకరణ కేంద్రాలపై తీవ్ర చర్చకు దారితీశాయి.

# ఆదిలాబాద్‌లో కదం తొక్కిన ఆదివాసీలు



(మొదటిపేజీ తరువాయి)

కొందరు నాపై విమర్శలు చేస్తున్నారని కానీ నేను ప్రస్తుతం వారి జోలికి వెళ్లానని తెలిపారు. దేశంలోని అన్ని వ్యవస్థలపై బీజేపీ దాడి చేస్తోందని దానిని అడ్డుకోవడానికే రాజ్ గోండు సేవా సమితి కి అధ్యక్షులుగా అయ్యానని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లు కుట్రలు పన్ని జీవో 49తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ జీవో రద్దు కోసం రాబోవు రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. రాబోవు రోజుల్లో పార్లమెంట్ సమావేశాల్లోనే ఉద్యమం చేస్తామని చెప్పారు. ఆదివాసులకు అన్యాయం జరిగితే ఇళ్ళు అమ్మి అయిన ఉద్యమిస్తానని చెప్పారు. నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించేందుకు సీఎంతో మాట్లాడుతానని చెప్పారు. అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తో మంచిగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**ఆదివాసులను ఏకతాటిపై తీసుకురావాలి- వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే**

రాజ్ గోండు సేవా సమితి బలోపేతం కోసమే సోయం బాపురావు కు అధ్యక్ష లభించిందని ఆదివాసులందరిని ఏక తాటిపై తీసుకురావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోయం పై విమర్శలు చేయడం మంచిది కాదని తెలిపారు. అందరిని తిట్టుకుంటూ పొతే మనల్ని ఎవరు దగ్గరికి రానియారని తెలిపారు. గత ప్రభుత్వం లో ఆదివాసులకు ఎలాంటి న్యాయం జరగలేదని.. ప్రస్తుత ముఖ్యమంత్రి మనవైపు ఉన్నారని న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఆదివాసీ సమాజం కోసం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సోయం ఆదివాసుల కోసం పనిచేస్తాడని పేర్కొన్నారు. అన్ని గిరిజన తెగలు కలిసికట్టుగా ఉండాలని తెలిపారు.

**సోయం ఆదివాసులకు జీవితం అంకితం చేశారు- కంది శ్రీనివాసరెడ్డి**

సోయం బాపురావు ఆదివాసుల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గతం లో బీజేపీ తో సంబంధం లేకుండా కేవలం తన బలం తో ఎంపీ గా గెలిచారని పేర్కొన్నారు. ఆదివాసీ సమాజమే సోయం ను కాపాడుకోవాలని తెలిపారు. నమ్మిన సిద్దాంతం కోసం పనిచేశారని.. జీవో 49ఉపసంహారణ కోసం కృషి చేశారని గుర్తు చేశారు. తాను కూడా ఆదివాసులకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. త్వరలో నే సోయంకు కార్పొరేషన్ పదవి వరిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, గ్రంథాలయం సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురా లు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, నాయకులు గణేష్ రెడ్డి, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో చర్చకు రెఢీ

(మొదటిపేజీ తరువాయి)

పహల్గాం ఉగ్రదాడి వెనుక నిఘా వైఫల్యం, ట్రంప్ నేనే యుద్ధం ఆపా వ్యాఖ్యల ఆధారంగా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టాలని విపక్షాలు యత్నిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో 100 శాతం లక్ష్యాలు సాధించామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక పోరులో తమ దృఢమైన వైఖరిని మరోసారి తెలియజేయనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలివారం బిహార్ ఓటరు జాబితా సవరణ సహా వివిధ అంశాలపై విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల్లో వాయిదాల పర్వం నడిచింది. సభా కార్యకలాపాలు సాగలేదు. సోమవారం నుంచి సభ సజావుగా సాగేందుకు అధికార, విపక్షాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం పార్లమెంట్‌లో చర్చ ప్రారంభం కానుంది. జాతీయ భద్రత, విదేశాంగ విధానానికి సంబంధించిన ఈ చర్చ వాడీవేడిగా సాగే అవకాశం ఉంది.

**అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధం**

కేంద్ర ప్రభుత్వం తరపున హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి జైశంకర్ సహా ఇతర సభ్యులు ఈ చర్చలో మాట్లాడనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వ బలమైన వైఖరిని చెప్పనున్నారు. విపక్షాల తరపున లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు తమ వాణి వినిపించనున్నారు.

# తెలంగాణ బీజేపీకి రైటర్ కాదు ఫైటర్ కావాలి

## హోంశాఖ మంత్రి అమిత్ షా నాకు ఫోన్ చేయలేదు

### కొంతమంది బీజేపీ మహిళానేతలకు దండం.. వారికి సన్మానం చేస్తా

### గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీకి రాజీనామా చేయడంలో ఎలాంటి కుట్ర లేదని స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా ఎమ్మెల్యే రాజాసింగ్ తిరిగి బీజేపీలో చేరనున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ప్రచారాన్ని ఖండించారు. తాను బీజేపీలో చేరడం లేదని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీ చీఫ్ రామచందర్ రావు మంచి రైటర్ అని, కానీ తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే మంచి ఫైటర్ కావాలి అంటూ వ్యాఖ్యానించారు. నా రాజీనామా వెనక కుట్ర లేదని, వేరే పార్టీ నుంచి బీజేపీలో చేరిన వారికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అన్యాయంపై కేంద్ర పార్టీకి చెప్పాలని అనుకుంటున్నానని వెల్లడించారు.



**కొంతమంది బీజేపీ మహిళానేతలకు దండం..**

'నా రాజీనామాను కేంద్ర పార్టీ ఆమోదించడం వెనక కుట్ర జరిగింది. నా పార్టీలో చేరడానికి నేను ప్రయత్నం చేయడం లేదు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎం చేయాలో కేంద్ర పార్టీకి వివరించాలని ఉంది. హోంశాఖ మంత్రి అమిత్ షా నాకు ఫోన్ చేయలేదు. తెలంగాణ బీజేపీలో జరుగుతున్న తప్పిదాలపై కేంద్రానికి లేఖ రాశా.. మెయిల్స్ చేశాను. వారి దృష్టికి వెళ్ళిందో లేదో.. తెలియదు. బేగంపేట ఎయిర్‌పోర్టులో కలిసినప్పుడు అమిత్ షాకు కలుస్తానని చెప్పాను.. ఆ లోపే రాజీనామా చేశాను. తెలంగాణలో 2014, 2018, 2023 ఎన్నికల్లో బీజేపీకి ఎవరు మోసం చేశారో, ఎవరు వెనక నుంచి కత్తిపోట్లు పొడిచారో ఐబీ రిపోర్ట్ కేంద్ర పార్టీ తెప్పించుకోవాలి. కొంతమంది బీజేపీ మహిళానేతలకు దండం. వారికి సన్మానం చేస్తా. నా ఉద్దేశ్యం ఒక్కటే బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడమే. నాకు అమిత్ షా ఫోన్ చేశారని యూట్యూబ్ ఛానళ్లలో ఫేక్ వార్తలు పెట్టించి రాజీనామా ఆమోదించేలా చేశారు. ఫేక్ వార్తలు, మీడియాలో లీకులు ఇచ్చే అలవాటు నాకు లేదు' అంటూ రాజాసింగ్ వెల్లడించారు.



# ఎంపీ సీఎం రమేష్ వ్యాఖ్యలపై స్పందించను!

- మామునూరు ఎయిర్ పోర్ట్‌కు రాణిరుద్రమ పేరు పెట్టాలి
- ఢిల్లీకి వెళ్లడం సీఎం రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

**వరంగల్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ రైతులను నమ్మించి మోసం చేశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మిర్చి రైతుల కోసం ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పోరాడుతున్నారని.. కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ఫ్లైట్‌మోడ్‌కు వెళ్లిపోయారని విమర్శించారు. ఆదివారం వరంగల్‌లో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. వరంగల్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని.. కానీ దానిని ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని ఆరోపించారు.

**హాఫ్ సెంచరీ సార్లు ఢిల్లీకి వెళ్లివచ్చినా..**

రైతు రుణమాఫీ చేస్తామంటే రుణాలు అధికంగా తెచ్చుకున్నారని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి కౌలు రైతులను మర్చిపోయారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధికోసమే కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ సార్లు ఢిల్లీకి వెళ్లివచ్చినా ఫలితం లేదని ఎద్దేవా చేశారు. పసుపు రైతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి ఒక్క ఉత్తరం కూడా ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. నకిలీ విత్తనాలు అమ్ముతుంటే స్థానిక మంత్రి ఏం చేస్తున్నారు..? అని నిలదీశారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌కు రాణిరుద్రమ ఎయిర్ పోర్ట్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎంపీ సీఎం రమేష్ వ్యాఖ్యలపై తాను స్పందించనని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

# యూరియా సరఫరాలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం

## కేంద్రం ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉంది

### ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దు

### కేంద్ర ప్రభుత్వంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపాటు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మంచి వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సరఫరాలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారన్నారు. జూన్‌లో 45 శాతం లోటు ఉందని తెలిపారు. కేంద్రం ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉందని చెప్పారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖలు రాశామన్నారు. మార్చి నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా సరఫరా కోసం విజ్ఞప్తి చేస్తున్నామని, ఢిల్లీకి వెళ్లి నేరుగా అధికారులను కలిసినప్పటికీ కేంద్రం నుంచి సరైన స్పందన లభించడం లేదని వాపోయారు. ఏప్రిల్ నెలలో 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం ఆ మొత్తాన్ని అందించలేదని ఆయన అన్నారు.

**పంట ఉత్పత్తి ప్రమాదంలో పడే అవకాశం..**

జులై నెలలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ప్రణాళికలో 6.60 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం 3.70 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం చెప్పేది ఒకటి, పంపించేది దానికంటే చాలా తక్కువగా ఉందన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఈ కొరత వల్ల ఖరీఫ్ సీజన్‌లో పంటల ఉత్పత్తి ప్రమాదంలో పడే అవకాశం ఉంది అని అన్నారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా, 2.37 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాబోయే నాలుగైదు రోజుల్లో సరఫరా చేయాలని కోరారు. మంత్రి తుమ్మల బీజేపీ నాయకులపై కూడా విమర్శలు గుప్పించారు. రైతుల మీద అవగాహన ఉంటే, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి యూరియా సరఫరా జరిగేలా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంపై అబద్ధపు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. మీకు పలుకుబడి ఉన్న మేరకు కేంద్ర మంత్రులతో మాట్లాడి రైతుల బాధలు తీర్చండి అని ఆయన బీజేపీ నేతలకు సూచించారు.

# కేటీఆర్.. ఇడియట్ మాటలు బంద్ చెయ్

- బుడంకాయ, వంకాయగాళ్లు ఏమీ చేయలేరు
- వంద మంది కేసీఆర్‌లు వచ్చినా బీఆర్ఎస్ బతకాదు
- మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్ ఇచ్చారు. ఇడియట్ మాటలు బంద్ చెయ్ అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పార్టీని నడిపే ఓపిక, శక్తి లేకనే విశ్రాంతి తీసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్‌ను కాపాడే శక్తులు లేవు, బీఆర్ఎస్ బతికించుకునే పరిస్థితులూ లేవని ఆయన తెలిపారు. కేసీఆర్ చేతులెత్తేసిన తర్వాత ఇక మీతో ఏమి అవుతుంది? అని ప్రశ్నించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్సీ .. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని తక్కువ చేసి కేటీఆర్ మాట్లాడడం భావ్యం కాదన్నారు. మీ భాషను మార్చుకోకపోతే బీ టీం వస్తదని, అప్పుడు తట్టుకోలేరని ఆయన హెచ్చరించారు. కాలం చెల్లిన బీఆర్ఎస్‌ను బతికించుకోవడం మీ వల్ల కాదన్నారు. ఇంకా వంద మంది కేసీఆర్‌లు వచ్చినా బీఆర్ఎస్‌ను బతికించుకోవడం కష్టమని అద్దంకి వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయడానికి చేస్తున్న వృధా ప్రయాసలను చూస్తే నవ్వొస్తుందన్నారు. మీరు సీఎంని డీ గ్రేట్ చేయడానికి చూస్తే అంతకంతకు పైకి ఎదిగిపోతుందన్నారు. కేటీఆర్, హరీష్‌రావు, జగదీశ్ రెడ్డి ఏమి చేయలేకపోగా ఇంకా పరువు తీసుకుంటున్నారని సెటైర్లు వేశారు. బుడం కాయలు, వంకాయలు, దోసకాయలు రేవంత్ రెడ్డిని ఏమీ చేయలేవని కామెంట్స్ చేశారు. కేసీఆర్ చేతకాకనే కామ్‌గా ఇంట్లో పడుకున్నాడని, ఇక మీ చేత ఏమైతది అంటూ వ్యాఖ్యానించారు. ప్రజలు మిమ్మల్ని బండకేసి బాదితే ఇంట్లో పడుకున్నారని, ఎక్స్పైరీ పార్టీని ఎంత బతికించాలనుకున్నా వృధా అంటూ అద్దంకి దయాకర్ కామెంట్స్ చేశారు.



కామారెడ్డిది బీసీ డిక్లరేషన్ కాదు..

# ముస్లిం డిక్లరేషన్

## బీసీ రిజర్వేషన్ల బిల్లు అడ్డుకుంటాం

బంజారాహిల్స్ ఆలయాన్ని కూల్చే అవసరమేంటి?

కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో చేసింది బీసీ డిక్లరేషన్ కాదని, ముస్లిం డిక్లరేషన్ అని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. కొత్తగా బీసీలకు పెరిగేది 5 శాతం మాత్రమేనని, ముస్లింలకు మాత్రం 10 శాతం రిజర్వేషన్ పెరుగుతుందని. ఇది బీసీ రిజర్వేషన్ కాదు, ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్లను అన్నారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కచ్చితంగా బీసీ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకుంటామని, హిందువులను రాహుల్ గాంధీ హేళన చేస్తున్నాడని, హిందూ ధర్మం అంతు చూస్తా అని రాహుల్ అంటున్నాడని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా అన్నారు. ఉప ఎన్నికలలో ఓట్ల కోసం జూబ్లీహిల్స్‌లో 30% ఉన్న ఒక సమాజాన్ని ప్రభుత్వం సంతృప్తి పరిచే ప్రయత్నిస్తుందా.. అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో, తెలంగాణలో ఎన్నో దేవాలయాలు, మసీదులు, చర్చిలు రోడ్డుపై ఉన్నాయి. కానీ బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయాన్ని కూల్చివేసే అవసరం ఏమిటి? కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని బండి డిమాండ్ చేశారు.

# ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ

## దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు చారిత్రాత్మక పథకం

- త్వరగా ఇండ్ల పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేపట్టాలి
- రైతులకు ఎరువుల కొరత లేకుండా అధికారులు పర్యవేక్షించాలి
- పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రతినిధులు కలిసి పనిచేయాలి
- మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి
- ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



**ఖమ్మం, మహా:** భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్‌తో అధికారులు సిద్ధంగా ఉండాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందిరా సౌర జల వికాసం పథకం కింద ఈ రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్, ఉద్యాన పంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పాల్వంచలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు ఖర్చు చేసే ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల స్థలంలో నిర్మించాలని, ఈ పాఠశాలలు ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వర్షాకాలంలో ప్రత్యేక దృష్టి అవసరమని, వైద్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు.

### శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు జరిగేటట్లు..

అధికారులు ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుంచుకొని పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసుకుని పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరిగేటట్లు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రతివారం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేద వారి సంక్షేమం కోసం రూపొందించిన పథకం అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధుల పైన ఉందన్నారు.

**వర్షా కాలంలో అప్రమత్తంగా ఉండాలి..**

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, యూరియా తక్కువ ఉన్నట్టు తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపు తిప్పే కార్యక్రమమని అభివర్ణించారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ జాగ్రత్తలు పాటిస్తూ ప్రస్తుతం 110 ఎంఎం చేప పిల్లలు పంపిణీ చేయడంతో పాటుగా, కౌంటింగ్ ప్రకారం అందజేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువు గట్ల పైన చెరువు సామర్థ్యం, ఎన్ని చేప పిల్లలు పెంపకం చేపడుతున్నాం, వాటి ఉత్పత్తి ఎక్కడ నుంచి, వాటి ఖర్చు తదితర పూర్తి వివరాలు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేస్తారన్నారు.

సామాజిక న్యాయం పాటిస్తాం...

# బీసీలకు ఎక్కువ సీట్లిస్తాం

బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే ఈ ప్రభుత్వం సెట్ రైట్ అయితది

పరకాల, భూపాలపల్లి సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)



బీఆర్ఎస్ శ్రేణులు స్థానిక ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని బంపర్ మెజార్టీతో గెలిపిస్తేనే రేవంత్ ప్రభుత్వం సెట్ రైట్ అవుతుందని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మంచిగా పనిచేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు సమ్మక్క సారక్క, రాణి రుద్రమ వారసులు అయిన వరంగల్ ఆడబిడ్డలు కర్రు కాల్చి వాత పెట్టాలని హెచ్చరించారు. పరకాలలో లలితా కన్వెషన్ హాల్‌లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లు, కేసీఆర్ కిట్లని మాజీ మంత్రి కేటీఆర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో సీఎం రేవంత్‌రెడ్డి గారడీ చేశారని.. రూ.4 వేలు పెన్షన్ అన్నారని.. ఎక్కడ వచ్చాయి..? తులం బంగారం, రైతు బంధు రూ.15 వేలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఓట్ల సమయంలో రైతుబంధు వేస్తున్నారని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాలని హెచ్చరించారు.




# ఎరువులు ఎక్కడి నుంచి వస్తాయో రామచందర్ రావుకు తెల్వదు

- వ్యవసాయం, రైతులు, బీసీలు, ఎస్సీలంటే ఆయనకు ఏం ఎరుక?
- హైదరాబాద్‌లో కూర్చొని ఏది పడితే అది మాట్లాడతే ఇక్కడ నడవదు
- కేంద్ర మంత్రులను కలిసినా దున్నపోతు మీద వాన పడినట్లు లేదు
- బీజేపీ స్టేట్ చీఫ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటర్

**సిద్దిపేట, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ నేతలు కుట్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకి మంత్రి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రామచంద్రరావుకి గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయం, ఎరువులు ఎక్కడి నుంచి వస్తాయో సరిగా తెలియనట్లు ఉందని విమర్శించారు. మిగతా అన్నిరకాల విత్తనాలు, నీళ్లు, విద్యుత్ అన్ని రకాల వస్తువులు రాష్ట్రాలు ఇస్తాయని.. ఎరువుల తయారీ కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉంటాయని వెల్లడించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి సరైన విధంగా ఎరువులు సరఫరా చేయమంటే చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్రప్రభుత్వం ఎరువులు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తల్లేదని బీజేపీ నేతలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. దేశంలో 29 రాష్ట్రాల్లో తెలంగాణ పట్ల కేంద్రప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### ఆ మాటలు వెనక్కి తీసుకోవాలి..

రామచంద్రరావు మాటలు వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దగ్గర కూర్చొని తెలంగాణ రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. రైతుల దగ్గర తమకు రాజకీయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. యావత్ రైతాంగం ఎరువులు కావాలని డిమాండ్ చేస్తోందని.. కేంద్ర ప్రభుత్వాన్ని ఎరువులు సరిపడా సరఫరా చేయాలని తాము కోరుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత కేంద్రమంత్రిని కలిశారని..ఎరువులు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. బీజేపీ నాయకత్వానికి కనీసం దున్నపోతు మీద వాన పడ్డట్లుగా కూడా లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎరువులు దాచిపెడుతోందని రామచంద్రరావు అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎరువులు వచ్చిన స్టాక్ ఎంత.. సరఫరా ఎంత రావాల్సిందో ముందు తెలుసుకోవాలని సూచించారు. రామచంద్రరావు వెంటనే ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని అడిగే ప్రయత్నం చేయాలని కోరారు. వ్యవసాయం, రైతులు, పల్లెలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు అంటే ఆయనకి తెలియదని.. హైదరాబాద్‌లో కూర్చొని ఏది పడితే అది మాట్లాడతానంటే నడవదని హెచ్చరించారు.



# సీఎం రమేశ్ పెద్ద బ్రోకర్!

- ప్రాణం పోయినా బీజేపీతో పొత్తు ఉండదు
- చిన్న, పెద్ద బ్రోకర్లు మాట్లాడితే అది పట్టించుకోవద్దు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నటనా కౌశల్యం ప్రదర్శిస్తున్నారు
- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** ప్రాణం పోయినా సరే బీజేపీతో పొత్తు ఉండదని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల సమయంలోనే బీజేపీతో పొత్తు అని వార్తలు వచ్చాయని.. అప్పుడే ప్రాణం పోయినా సరే బీజేపీతో పొత్తు ఉండదని కేసీఆర్ చెప్పారని తెలిపారు. ఈరోజుకు కూడా అదే మాట మీద ఉన్నామని పేర్కొన్నారు. సీఎం రమేశ్ లాంటి బ్రోకర్లు చెప్పే మాటలు పట్టించుకోవద్దని సూచించారు. బీజేపీ తెలంగాణకు పనికివచ్చే పార్టీ కాదని.. బీఆర్ఎస్ భావజాలం వేరు.. బీజేపీ భావజాలం వేరు అని కేసీఆర్ చెప్పారని జగదీశ్ రెడ్డి తెలిపారు.

**మానసిక స్థితిపై ప్రజల్లో అనుమానం..**

చిన్న, పెద్ద బ్రోకర్లు మాట్లాడితే అది పట్టించుకోవద్దని.. చంద్రబాబు నాయుడు అలాంటి వారికే పదవులు ఇచ్చారని అన్నారు. సీఎం రమేశ్ ఇంటికి నేను కూడా మిత్రునిగా వెళ్ళాను. ఆయన ఇంటికి కేటీఆర్ లేదా నేను వెళ్తే తప్పు ఏంటి అని ప్రశ్నించారు. సీఎం రమేశ్ ఢిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి ఇంట్లోనే ఉంటున్నాడని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని 23వ బంగ్లాలో ఉన్న రేవంత్ రెడ్డి ఇంట్లోనే సీఎం రమేశ్ ఇంట్లోనే ఉంటున్నాడు.. ఆ సీసీ టీవీ ఫుటేజి తీద్దామా అని నిలదీశారు. సీసీ టీవీ ఫుటేజ్‌లు తీయాలంటే సీఎం రమేశ్ తన జీవితకాలంలో ఎక్కువగా చంద్రబాబు నాయుడు, సీఎం రేవంత్ రెడ్డి ఇంట్లో ఉంటారన్నారు. సోనియాగాంధీ అవార్డు గ్రహీత అయిన రేవంత్ మానసిక స్థితిపై ప్రజల్లో అనుమానం ఉందన్నారు. రేవంత్ రెడ్డి నటనా కౌశల్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఆయన మాటలు వింటే గోబెల్స్ ఆత్మహత్య చేసుకుంటారని చెప్పారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్ రెడ్డి గోబెల్స్‌ను మించిపోయారని మండిపడ్డారు.

**ఆస్కార్ అవార్డుకు అర్హుడు..**

జైపాల్ రెడ్డి ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, తెలంగాణ గురించి మాట్లాడలేదని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని చెప్పారు. అసలు రేవంత్‌ని మనిషిలాగా చూడటానికి కూడా జైపాల్ రెడ్డి ఇష్టపడలేదని, గొంగళి పురుగు కంటే హీనంగా చూశారని విమర్శించారు. రేవంత్ రెడ్డిని జైపాల్ రెడ్డి ముందే కరెక్ట్‌గా అంచనా వేశారని మండిపడ్డారు. 'చాలామంది నియంతలు వచ్చి వెళ్లారు. అబద్ధం సిగ్గుపడేలా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి ఆస్కార్ అవార్డుకు అర్హుడు. స్క్రిప్ట్ రాసిస్తున్న వాళ్ళు రేవంత్ రెడ్డి పరువు తీస్తున్నారు. నువ్వు సీఎం కుర్చీలో ఐదేండ్లు ఉండాలని కోరుతున్నాం. నీ పక్కన ఉన్నవాళ్లతో నీకు భయం ఉంటే మేము ఏం చేయలేం. అందుకే మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నావు' అంటూ వ్యాఖ్యానించారు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రముఖ జర్నలిస్ట్, రచయిత్రి రానా అయ్యూబ్

**హైదరాబాద్, మహా :**

ప్రముఖ జర్నలిస్ట్, రచయిత్రి రానా అయ్యూబ్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం భేటీ అయిన సందర్భంగా.. ఆమెను రేవంత్ రెడ్డి సత్కరించారు. తాను త్వరలో భారతదేశంపై రచిస్తున్న కొత్త పుస్తకం కోసం పరిశోధనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని రానా అయ్యూబ్ కలిశారు. పరిశోధనకు అవసరమైన సహాయం తప్పకుండా చేస్తానని సీఎం హామీ ఇచ్చారు. కాగా ప్రముఖ అంతర్జాతీయ పత్రికకు కాలమిస్ట్ అయిన రానా.. గతంలో గుజరాత్ ఫైల్స్ అనే పుస్తకాన్ని కూడా రచించారు.



చారిత్రాత్మక,ప్రసిద్ధి చెందిన లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయంలో ఆదివారం మారు బోనం సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఉదయం అమ్మవారికి అభిషేకం అర్చన అనంతరం ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధూ కుటుంబ సభ్యులతో వచ్చి సాంప్రదాయ బద్ధంగా బంగారు బోనం ఎత్తు కొని అమ్మవారికి మారు బోనం సమర్పించారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె. వెంకటేష్,కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్ తదితరులు పీవీ సింధూ కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవీ సింధూ మాట్లాడుతూ లాల్ దర్వాజా అమ్మవారు అంటే తనకు ఇష్టం అని ప్రతి సంవత్సరం అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తూ ఉంటానని అన్నారు. ఆమె ఆశీర్వాదం తీసుకొని టోర్నమెంట్ లకు వెళతానని అన్నారు.

పార్టీ విలీనం కోసం బీజేపీ ఎంపీ ఇంటికి

# కేటీఆర్ వెళ్లారా? లేదా?

సీఎం రమేశ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్



**హైదరాబాద్, మహా:** రాష్ట్రాన్నిచ్చిన సోనియా గాంధీ వద్ద బీర్ఎస్‌ను విలీనం చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని, పదేళ్లు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ వ్యాపారులకే కాంట్రాక్టులు ఇచ్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. తెలంగాణ పదాన్ని పార్టీ నుంచి తీసి బీఆర్ఎస్‌గా మార్చుకున్నప్పుడే రాష్ట్రంతో ఆ పార్టీకి బంధం తెగిపోయిందని అన్నారు. 'కేటీఆర్.. పార్టీ విలీనం కోసం బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి మీరు వెళ్లారా? లేదా? కవితపై ఉన్న ఈడీ, సీబీఐ కేసులు కొట్టివేస్తే బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తామని చెప్పారా లేదా? భారత రాష్ట్ర సమితి ఒక అవినీతి పార్టీ అని.. ఆ పార్టీ విలీనం వద్దంటే వద్దని బీజేపీ పెద్దలు అన్న మాట వాస్తవమా కాదా? మీరు సమాధానం చెప్పాలి. కొన్ని సామాజిక వర్గాలను కూడా మీరు తిట్టినట్లు సీఎం రమేశ్ చెప్పారు. విషయాన్ని పక్కదారి పట్టించకుండా ధైర్యం ఉంటే సీఎం రమేశ్‌కు సమాధానం చెప్పాలి. కేటీఆర్ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనించాలి' అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## వన దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

### మొక్కులు చెల్లించుకున్న మంత్రి

2026 మేడారం మహా జాతరకు 150 కోట్లతో శాశ్వత పనులు

అధికారులతో సమీక్ష



**తాడ్వాయి, మహా :** మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి వర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అనంతరం తల్లుల ప్రాంగణంలో రాబోయే 2026 మహా జాతరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కుంభమేళాను తలపించే సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పటిష్టంగా...ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. జాతరలో తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ శాఖ సేవలు, రోడ్ల మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసిందన్నారు. ముఖ్యంగా జాతర సమయంలో భక్తులు, వీఐపీలు బస చేయడానికి వీలుగా మేడారంలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 28-07-2025



# వానొస్తుంది



వానొస్తదా
నిజంగానే వానొస్తదా!

రావాలనడానికి
పెనం మీది నూనె బొట్టులా
చెరువులోమూలనున్న నీటిచుక్కలే సాక్ష్యం.
వానొస్తది
మేఘాల కడుపుల్లో ఎన్ని రోజులు
గర్భవతిగా గడుపుతుంది
ఆకాశం చీకటి గదిలో
ఎన్నిదినాలు పురిటినొప్పులుభరిస్తది
వానొస్తది
నేడో,రేపో,ఇప్పుడో,
ఈ జామో ఆ జామో వచ్చి
సూర్యుని ఎండదుప్పటిని
నీటి కత్తులతో చీల్చి
భూమిపై పచ్చని తివాచి పరిచి
గర్భివాళ్ళు తనివి తీరా
హాయిని పీల్చు తున్నపుడు
కళ్ళారా చూసి మురిసి పోదామని
వానొస్తది.

ఆకుపచ్చని చెట్ల కురులు
ఎండకు ఎరుపెక్కినయని
పూల బాలల చెంపలు మాడి పోయాయని
పాలకోసం గుక్కపట్టిన పసిపాపలా
పశుపక్షాదులు నదుల ఎదలపై
తండ్లాడటంను చూడలేక వానొస్తది

ఎగదోస్తున్న మంటల్లో పడ్డ
భూచరాల కేకలు విని ఉండలేక వానొస్తది

మేఘాలకు మనిషితనం లేదు గనుక
ఇచ్చిన మాటను విసిరేసే గుణం కాదు గనుక
మాటిచ్చి మోసపు మడుగులో
ముంచే తత్వం లేదు గనక
కొంచెం వెనకో ముందో తప్ప కుండా వస్తది
మలినాలతో కడుపుబ్బిన
సముద్ర ఘోష విషమించడం చూసి
మనకు ప్రాణజల మివ్వడానికి వానొస్తది

బూమీ ఆకాశాల సుదీర్ఘ ప్రేమకు
చిగురులు తొడగడానికి వానొస్తది.
వాన తప్పకుండా వస్తది
పక్షికంటి దుఃఖాన్ని తుడవడానికి
పశువుల కాలిడెక్కల మంటలు ఆర్పడానికి
చెట్ల తాపాన్ని తీర్చడానికి
వానొస్తది వాన తప్పకుండా వస్తది

తాను ఖాళీ దేహమై
తన జీవితమే ఖాళీ చేసిన ఇల్లయి
మనకోసం ఇక్కడో అక్కడో ఎక్కడోఒకచోట
వస్తూ కురుస్తూ పలుకరిస్తూనే ఉంటది
తన జీవధాతువుల్ని ధార పోస్తూనేఉంటది.

- డా. ఉదారి నారాయణ,
9441413666.

## రీతి


అరిచి గీపెట్టాను
పరిసరం నవ్వింది
రిలాక్సయ్యాను
అది కుతకుతమంది

బాధ్యతల మంచుశిల
ఎదలో కరగదువిరగదు
కష్టాల్లో కాగితే తప్ప
అది నీరై ప్రవహించదు

పీడ విరగడయి
సంకెల తగులుకొంది
తెగేదాకా లాగాలి
బతుకు సరళరేఖ

సొంత లోకాల్లో మనుషులు
తమవైన రీతుల్లో నడకలు
అన్ని కాలాల్లో ఒకే రీతిన
వేలాడే గబ్బిలమా వందనం

- బి.వి.ఎన్.స్వామి, 9247817732



కేంద్ర సాహిత్య అకాడమీ 2024 అవార్డు గ్రహీత - గగన్ గిల్

# రచన ఒక అన్వేషణ

పదే పదే, ఆ అమ్మాయి దుఃఖపు తలుపు వరకు
వెళుతుంది
పదే పదే, ఆ అమ్మాయి దుఃఖపు తలుపు
వద్దకు తిరిగి వస్తుంది

అంటుంది గగన్ గిల్ "అప్పుడామె చెల్లెలు నిశ్శబ్దంగా ఉంటుంది " అన్న కవితలో. ఆ అమ్మాయి దుఃఖపు తలుపు దగ్గరకు పదే పదే వెళ్ళడమూ, మళ్ళీ అదే దుఃఖపు తలుపు దగ్గరకు తిరిగి రావడం నడుమ దాగివుంది మానవ జీవిత సారాంశం అంతా. ఏడుస్తూ పుట్టి ఏడిపిస్తూ వెళ్లిపోయే మనిషి జీవితంలో ఆనందం కంటే బాధామయ సందర్భాలే ఎక్కువ. ఆ సందర్భాలు అన్నిటికీ గగన్ గిల్ తన కవిత్వంలో చోటు కల్పించింది కనుకే ఆమె కవిత్వం నిండా దుఃఖము, దుఃఖాన్ని వ్యక్తీకరించే శోకం, విచారం, సంతాపం, వేదన, గాద్గదిక్యం స్మృతి, లాంటి పర్యాయ పదాలు అనేకం కనపడతాయి.

నా ఏకాంతంలో నుండి
నేను బయటకు వచ్చినప్పుడు
ఈ ప్రపంచం తన రాగాలు మార్చుకుంటుంది
భాష తన అర్థాన్ని కోల్పోతుంది

అని మై జబ్ తక్ ఆయీ బాహర్ కవిత్వ సంపుటిలో అంటుంది గగన్ గిల్.

ఎవరీ గగన్ గిల్? 2024వ సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన గగన్ గిల్ కేవలం కవి మాత్రమే కాదు. ఆమె మంచి రచయిత్రి. అంతకు మించి ఆధ్యాత్మిక సాధకురాలు కూడా. 1947లో దేశ విభజన తరువాత భారత దేశానికి పాకిస్థాన్ నుండి వలసవచ్చిన పంజాబీ దంపతులకు 1959లో జన్మించిన గగన్ గిల్ తన మాతృ భాష పంజాబీలో కాకుండా హిందీలో కవిత్వం రాసి మెప్పించారు. తల్లి తండ్రులు ఇద్దరూ మంచి సాహిత్య వేత్తలు. తల్లి పంజాబీలో దాదాపు 150 గ్రంథాలు రాసింది. తండ్రి మంచి సంస్కృత పండితుడు. రామాయణ, మహాభారతాలు, వేదాలు, ఉపనిషత్తులు ఆయనకు కరతలామలకం. అంతేకాదు, అమృతా ప్రీతమ్, హర్భజన్ లాంటి సాహిత్య దిగ్గజాల నీడలో పెరిగింది. నిర్మల్ వర్మ అనే మరో గొప్ప సాహిత్య కారుడిని పెళ్లి చేసుకుంది. అలాంటి సాహిత్య వాతావరణంలో నుండి వచ్చిన గగన్ గిల్ వలస రాజ్యానంతర లేదా స్వతంత్ర భారత దేశ చరిత్ర మొత్తం ఒక పీడకలల చరిత్రే అంటుంది. 1947 మత హింస 1984లో పునరావృతమైతే, 1984 మళ్ళీ 2002లో పునరావృతమైంది అంటుంది.


గిల్ మొదటి కవితా సంకలనం ఏక్ దిన్ లౌటేగీ లడకీ (ఒక రోజు ఆ అమ్మాయి తిరిగి వస్తుంది) 1989లో వచ్చింది. ఒక అమ్మాయి కేంద్రంగా వచ్చిన ఈ సంపుటిలో ప్రేమ, ఆకాంక్ష, దుఃఖం, కోరిక, ఆందోళన, విసుగు లాంటి భావోద్వేగ అనుభవాలపై గగన్ దృష్టి నిలిపింది. ఈ అమ్మాయి ఒక వ్యక్తిగత పాత్రకు ప్రతీకగా ఉంటూనే, స్వాతంత్ర్యానంతర భారతీయ మహిళలకు ప్రతినిధిగా, ఆధునికత యొక్క కొత్త భావనను కనుగొంటూ, ఇంటి నుండి బయటకు అడుగుపెట్టి, ఇంటిని మరియు ప్రపంచాన్ని నిర్వహించడానికి పోరాడుతున్న స్త్రీకి ప్రతిరూపంగా గగన్ గిల్ మలిచింది . दफ्तर में ऊँघती हैं लड़कियाँ (ఆఫీసులో నిద్రమత్తులో ఉన్న అమ్మాయిలు) అనే కవిత చదివితే గిల్ ఆఫీసులలో పనిచేసే మహిళల జీవితాన్ని ఎలా అక్షరబద్ధం చేసిందో తెలుస్తుంది.

Girls doze in their office
They doze from work, from fatigue
They doze from boredom, from drowsiness

ఆఫీసులో అమ్మాయిలు
నిద్రమత్తులో ఊగుతూ ఉంటారు
పని వల్ల , అలసట వల్ల,
నిద్రలేక మత్తులో ఊగుతూ వుంటారు.
నీరసం వలన, మగత వలన, నిద్ర మత్తులో ఊగుతూ వుంటారు

గిల్ ఇంటి పని, ఆఫీస్ పని నడుమ స్పష్టమైన విభజన లేక, అలాంటి విభజన నిర్ణయించుకునే పరిస్థితులు లేని వర్కింగ్ ఉమెన్ కి సరి అయిన నిద్ర కూడా ఉండదు. ఆ విషాద వాస్తవాన్ని ఈ నాలుగు వాక్యాలు ప్రతిభావంతంగా వివరిస్తాయి. తోసుకుని వచ్చే జీవితంలో పడి వాళ్ళు భౌతికంగానూ, మానసికంగానూ ఎంతలా మారిపోతారో..

వారి జుట్టు బూడిద రంగులోకి మారడం వారి ఆఫీసుల జైలులో చూస్తారని అనటం ద్వారా తెలియజేస్తుంది. నిజానికి ఒక బిడ్డను కని,పెంచడం అనేది



మై జబ్ తక్ ఆయీ బహార్

పార్ట్ టైమ్ జాబ్ కాదు. కానీ ఉద్యోగం చేసే మహిళలు రేపో, మాపో డెలివరీ అన్నదాకా పని చేస్తూనే ఉండి చివరి రెండు రోజుల ముందు మూడు నెలల మెటర్నిటీ లీవ్ తీసుకుంటారు. అలా తప్పని విషాదానికి బలయ్యే స్త్రీలు వాళ్ళు.

'మూడు నెలల పాటు తల్లులు అవుతారు' అంటుంది. మహిళల ఆశలు, భయాలు, కోరికలు మరియు నిరాశలను వ్యక్తపరుస్తారు. ఈ మొదటి కవితా సంకలనం గిల్‌ను హిందీ కవిత్వంలో కొత్త స్వరంగా స్థాపించింది.

గిల్ 1982 నుండి 1989 వరకు ఢిల్లీలో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌లో జర్నలిస్ట్‌గా పనిచేసింది, ఆ తర్వాత 1989 నుండి 1993 వరకు ది సండే అబ్జర్వర్‌తో పనిచేసింది. 1993లో ఆమె ఎడిటర్‌గా తన ఉద్యోగాన్ని వదిలిపెట్టి పూర్తి సమయం రచనా వృత్తికి కేటాయించింది. ఆమె తదుపరి కవితా సంకలనం,


గగన్ గిల్

అంధేరే మే బుద్ధ (చీకటిలో బుద్ధుడు1996) ఆమెలో బౌద్ధంపై పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తుంది 1997లో ఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో టిబెట్‌లో జన్మించిన Lobsang Tenzin అనే బౌద్ధ సన్యాసిని కలిసింది, అతను 1959 టిబెటన్ ఉద్యమం తర్వాత దలైలామాతో పాటు భారతదేశానికి పారిపోయి వచ్చాడు. టెన్జిన్ భారతదేశంలోని పలు టిబెటన్ విద్యా సంస్థలను నడిపించాడు మరియు తర్వాత టిబెటన్ ప్రభుత్వ ఇన్‌ఎక్సైల్‌కు మొదటి ఎన్నికైన ప్రధానమంత్రి అయ్యాడు. Lobsang Tenzin ఆమె మీద చాలా ప్రభావాన్ని చూపాడు . తన మూడవ కవితా సంకలనం, యహ్ ఆకాంక్ష సమయ్ నహీ (అసమయ కోరిక, 1998), 'లోబ్సాంగ్'కు అంకితం చేసింది.

గిల్ యొక్క మొదటి గద్య రచన దిల్లీ మే ఓ నీందే (ఢిల్లీలో నిద్రమత్తు, 2000). ఇందులో ఆమె చిన్న ప్రయాణ కథనాలు, స్నేహితులు మరియు అపరిచితులతో ఆమె ఎదుర్కొన్న అనుభవాలు ఇంకా ఆమె తండ్రి మరణం గురించి ఒక పెద్ద వ్యాసం ఉన్నాయి. ఆమె గద్యం ఆమె తండ్రి, స్నేహితులు, సన్యాసులు మరియు అపరిచితులతో ఆమె సంబంధాలను రికార్డ్ చేస్తుంది. 2011లో, సారనాథ్‌లో లో జరిగిన ఒక పబ్లిక్ ఫంక్షన్ దలైలామా నుండి దీక్ష పొందింది, కూడా వదిలిపెట్టింది. ఆమె ప్రస్తుతం న్యూ ఢిల్లీ శివార్లలోని గ్రేటర్ నోయిడాలో తన ఇంటిలో ఒంటరిగా జీవిస్తుంది. సన్యాసి ఆశ్రమంలో ఉన్నట్లు ప్రపంచం అనే బాహ్య జగత్తు నుండి తనను తాను ఉపసంహరించుకుని స్వీయలోకం లోకి వెళ్ళిపోయింది . ఆమె తన సమయాన్ని ఎక్కువగా జపం, ధ్యానం మరియు ప్రార్థనలో గడుపుతుంది. ఆమె తాజా కవితా సంకలనం, మైం జబ్ ఆయీ బహార్ (నేను బయటకు అడుగుపెట్టినప్పుడు, 2018), ధ్యాన మయ జగత్తులోకి ఒక దృష్టిని అందిస్తుంది, కవితలు ప్రార్థనలుగా, ప్రార్థనలు కవితలుగా ఈ సంపుటిలో బలంగా కనిపిస్తుంది.

ఒక ఇంటర్వ్యూ లో అర్చిత్ నందా వాట్ ఈజ్ యువర్ డైలీ క్రియేటివ్ ప్రాసెస్ అని అడిగితే గగన్ గిల్ ఇలా చెప్పింది "నా దినచర్యలో, నా అంతర్గత జీవితానికి అనుగుణంగా లేని ఏదీ నేను చేయను మరియు జరగనివ్వను. నేను వైరుధ్యాలలో జీవించాలనుకోవడం లేదు. మరోవైపు, రాయడానికి వైరుధ్యాలతో పోరాడవలసి ఉంటుంది. నేను నా ఎక్కువ సమయం చదవడం లోనే గడుపుతున్నాను. బౌద్ధ చరిత్ర, తత్వశాస్త్ర, సాహిత్యం చదువుతున్నాను. నేను సృజనాత్మక రచయితని, అయినప్పటికీ మంచి కవితలు లేదా వ్యాసాలు రాయడం నా ప్రాధాన్యత కాదు. ఎందుకంటే రాయడం దాదాపుగా ఒక యాత్ర లేదా అన్వేషణ లాంటిది. ఇది పురావస్తు ప్రాజెక్టు కోసం తవ్వడం లాంటిది. ఆలోచనలను రూపొందించడానికి, ఆ ఆలోచనలను రూపం లోకి తీసుకునిరావడానికి తగిన భాష అన్వేషించడానికి సమయం అవసరం. రచయితగా, ఇతర సమకాలీన రచయితల వలె రాయడం ఇష్టం లేదు నాకు రెండవది, నా పాత రచనల వలె రాయడం కూడా ఇష్టం లేదు. నేను నన్ను నేను పునరావృతం చేసుకోకూడదు. ఒకే విషయాన్ని పదే పదే రాస్తూనే ఉండే రచయితలు ఉన్నారు. వాళ్ళు కొత్త అంశం గురించి రాస్తున్నామని నమ్ముతారు, వారి వస్తువు కొత్తది అయినప్పటికీ, ఆలోచనలు పాతవి పూర్వకాలం వి అవుతాయి. కాలక్రమేణా మారుతూ అభివృద్ధి చెందుతూ ఆ వస్తువు తోనే ఒక కొత్త వస్తువు ఆవిర్భవించింది అన్న విషయాన్ని ఎలా నిర్ధారించాలి? కాలం గడిచేకొద్దీ రాయడం కష్టతరం అవుతుంది. రాయడం ఒక సాఫ్ట్వేర్ ప్రోగ్రాం కాదు. అదొక ఆల్కెమీ" అని బలంగా నమ్మి చెప్పే గగన్ గిల్

"For me, the real path is the path of prayer. It is the path of solitude, the path of darkness and the path of silence. It is not this path of society, literature, limelight and success. I am like a person full to the brim. I have gotten everything in life. I have seen a lot. I have travelled a lot. I have taken all kinds of journeys. After so much, there is still emptiness, and destiny beckons me" అంటుంది

- వంశీకృష్ణ, 95734 27422

### గగన్ గిల్ పద్యం...

ఆమె అతడిని స్పర్శిస్తుంది
ఒకానొక అపరిచిత నక్షత్ర మండల మీద
ఇంద్రియానుభవాల సప్తమ స్వర్గం లో
ఉన్మత్త కోరికల వింత వెలుగులో
ఒక ఉదయం పూట అతడిని స్పర్శిస్తుంది

పవిత్రమైన అగ్నిలా
స్థాణువైన వాయువులా
బరువైన మేఘం లా
అతడిని స్పర్శిస్తుంది

సృష్టి ప్రారంభమైన ఆరవ రోజు
తనలోనుండి పయనించి
తనను శిథిలం చేసి

తననే మళ్ళీ పునః సృష్టించే దేవుడి లాంటి
అతడిని ఆమె స్పర్శిస్తుంది
మార్మిక జలం లాగా
అంతుచిక్కని ఆ మాయావిని
ఒక తెల్లవారుజామున స్పర్శిస్తుంది

ఇంకా,తనకోసం ఒక చేప పిల్ల మరణాన్ని
ఎన్నిక చేసుకుంటుంది

తెలుగు అనువాదం - వంశీకృష్ణ

# చిగురించే ఆశయాల విల్లంబులు స్వామి కవితలు

కవిత్వం ఒక ప్రాంతానికి పరిమితమైనది కాదు. కవిత్వం విశ్వజనీయమైనది. కవిత్వం ఒక ప్రాంతములోని ప్రజల యొక్క జీవన్మరణ పోరాటాలకు అచ్చమైన ప్రతిబింబం. కవి సృజించిన కవితా సంపుటిని మనం చదువుతున్నామంటే ఆ ప్రాంతంతో మమేకమైపో తున్నట్లు. అక్కడి జీవనాన్ని స్పృశిస్తున్నట్లు. అక్కడ పారే నదుల్లా,వీచే గాలుల్లా మనం కూడా ఆ పరిసరాలతో తన్మయత్వం చెందుతున్నట్లు. హత్తుకునే భావాలతో కరచాలనం చేస్తున్నట్లు. నగర ప్రాంతాల నాగరికత, మైదాన ప్రాంతాల విభిన్న జీవనం, ఆదివాసి ప్రాంతాల సామూహిక జీవనం భిన్న కోణాల్లో కవులు సృజిస్తుంటారు. ఉత్తరాంధ్ర నుండి ఆదివాసి కవిత్వం ' శతర ' పేరుతో కవితా సంపుటిని వెలువరించారు ప్రసిద్ధ కవి మిత్రుడు సిరికి స్వామి నాయుడు . మైదానా ప్రాంతం నాగరికతలో, నగర నాగరికతలో జీవిస్తున్న ప్రజల అనుభవాలకు పూర్తి విరుద్ధమైనవి ఏజెన్సీ ప్రాంత ఆదివాసి గిరిజనుల జీవితాలు. విస్తారమైన ప్రకృతి సంపద వున్నప్పటికీ అది వాళ్ళకు సొంతం కాదు. పాలకుల ద్వంద్వ నీతి వల్ల అడవి పుత్రుల బతుకు యాతనలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. వాళ్ల దుర్భరమైన జీవితాలను 56 కవితలలో అక్షరీకరించారు స్వామి నాయుడు గారు. ' దుర్ల' కవితలోని ఈ వాక్యాలను చదివితే చాలు స్వామి నాయుడు గారి దృక్పథం మనకు అవగతమవుతుంది.

**యిక చాలు.. మా అడవికి మమ్మల్ని దూరం చేసే**
**మీ ఆకుపచ్చని పన్నాగానికొక దండం**
**సుజల సెలయేటి వాగుల్ని**
**కలుషిత కాసారాలుగా చేయడమే నాగరికత అయితే**
**మీ నాగరికతకొక దండం**
**అదిగో చినుకూ చినుకూ కురిసి వాగైనట్టు**
**పదం పదం కలిసి జనజాతరై దుర్ల కదల బారుతోంది**
**మీకు తెలుసో లేదో..**
**ఆది నుండి అడవి ఒక యుద్ధక్షేత్రం!!'**

ఆదివాసి గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు వాళ్ళ సామూహిక జీవనానికి పట్టుగొమ్మలు. ప్రత్యేకమైన పండుగలు, పురాణ కథలు, పాటలతో వాళ్ళంతా కలివిడిగా ఒకే ప్రాంతంలో వుంటారు. ఈ ఆదివాసీ ప్రాంతాల్లో కొందరు మతాల పేరుతో రకరకాల కార్యక్రమాలను చేపడుతున్నారు. గిరిజనుల సాంస్కృతిక జీవనాన్ని ధ్వంసం చేస్తున్న తీరును పదునైన కవితా పాదాలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కవిత ' శిశిరం నడిచిన జాడలు'. మతతత్వంతో కూడిన విధానాలను వాళ్ళ మీద రుద్దవద్దని హెచ్చరిస్తున్నారు కవి. ఆదివాసుల పక్షాన నిలబడి ధిక్కార స్వరాన్ని ఈ వాక్యాలు




ద్వారా కవి వినిపిస్తున్నారు.

**'చాలు, కల్చరల్ పోలీసై**
**మతం, మా మీద కవాతు చేసిందిక చాలు**
**స్వచ్ఛమైన సెలయేటి వాగుల్ని కలుషితం చేయడమే**
**మతమైతే.. ఆ మతాన్ని ధిక్కరిస్తున్నాం**
**సహజవర్ణాల అడవి పూలకు రంగులదద్దమే మతమైతే**
**ఆ మతాన్ని బహిష్కరిస్తున్నాం**
**మా బతుకులు మమ్మల్నిలా బతకనీయండంటూ..**
**సమస్త అడవిని ఒక ముకుళిత హస్తం చేసి**
**వేడుకుంటున్నాం/ కాదు కూడదంటే.. అడవి అడవంతా**
**ఓ కల్లోల కడలి తరంగమై పోటెత్తుతుందని**
**హెచ్చరిస్తున్నాం..!'**

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళోద్యమం, ఉత్తర తెలంగాణలోని గోదావరి లోయ ప్రాంతంలో జరిగిన పోరాటాలన్నీ భూమి కోసమే కదా. కనుచూపు మేర విస్తారమైన సాగు భూములున్న కూడా వాటిపైన హక్కులు లేక పోడు వ్యవసాయం చేస్తున్నారు. పాలకుల హింసకు అమరులైన వాళ్ళను స్మరించుకుంటూ కవిత గానం చేస్తున్నారు కవి. గత ఆరు దశాబ్దాలుగా భూమి కోసం, భుక్తి కోసం ,విముక్తి కోసం జరుగుతున్న భూ పోరాటాల్లో ఒరిగిన అడవి అన్నల జీవితాలను తలుచుకుంటున్నారు కవి. ఒకరు పోతే మరొకరు పోరాటాన్ని ముందుకు తీసుకపోతారనే ధైర్యాన్ని 'వేట' కవిత ద్వారా దృశ్యమానం చేశారు కవి.

**యిప్పుడు ఏమి చేస్తారు?**
**భూమి కోసం భుక్తి కోసం**
**విముక్తి గీతాలు పాడుతున్నాయనీ**
**బహుశా అడవుల్ని ధ్వంసం చేస్తారు సరే..**
**ఆకుపచ్చని వేటాడీ..**
**అడవి కాపుల్ని నిర్మూలిస్తారు సరే..**
**చిగురించే ఆశయం మాటేమిటి?'**

వర్తమానంలో పెరుగుతున్న రాజ్య హింసతో కలత చెందుతున్నారు కవి. ప్రజా చైతన్యం కోసం తన కలాన్ని, గళాన్ని ఒకటి చేసి ప్రశ్నించడం మొదలుపెడతాడు. అన్యాయంపై అక్షర క్షిపణులను కురిపిస్తాడు. ఏజెన్సీ ప్రాంతంలోని భూమి గిరిజనేతరులకు చెందకుండా వన్ ఆఫ్ సేవంట్టి చట్టంలోని నిబంధనలు పాటించాలని డిమాండ్ చేస్తారు. ఈ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి గిరిజనులు సుదీర్ఘమైన పోరాటం చేస్తూనే వున్నారు. అదిలాబాదులోని ఇంద్రవెల్లి అయినా, శ్రీకాకుళం లోని పార్వతీపురం అయినా ఒకటే కదా. ' అడవి మాట్లాడుతోంది ' కవిత ద్వారా ఆదివాసి గిరిజనుల పోరాటాల నేపథ్యాన్ని వివరిస్తూనే, తక్షణ కర్తవ్యాన్ని కూడా ఉద్బోధిస్తున్నాడు కవి.

**'నాటికీ నేటికీ**
**అడువెప్పుడూ రాజ్యానికి తలవంచని ప్రశ్నే**
**ఇంద్రవెల్లి కొండల్లోంచో.. లోవముతా లోయల్లోంచో**
**కొండ గాలికి నెగడై రాజుకుంటున్న కల్లోలకెరటమే**
**నీటి కోసం.. అడవి కోసం.. హక్కు కోసం నినాదమై**
**ఎగిసిపడే నిప్పుల జెండానే..!'**


ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యమాలన్నీ కూడా జల్, జంగల్ ,జమీన్ కోసమే. ఒకపక్క ఆదివాసి గిరిజనులు సాగు చేసుకుంటున్నా భూములను రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో స్వాధీనం చేసుకుంటున్నారు. అడవిలో నిక్షిప్తమైన విలువైన ఖనిజాల కోసం కార్పొరేట్ సంస్థలు పోటీ పడుతున్నాయి. అడ్డుకుంటున్న ఉద్యమకారులను, ఆదివాసులను నిర్బంధిస్తున్నారు. ఇది ఒక వైపు సాగుతుండగా మరొకవైపు ఆధునిక విలాసాలు గిరిజన గూడాల్లోకి చొరబడి వాళ్ల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్న వైనాన్ని ఆవేదనాత్మకంగా 'శతర' కవితలో వివరిస్తున్నారు కవి.

**అరుగుల మీద సవర గీతాలు పాడుతూ**
**కొమ్ము బూరలూదుతూ.. బృందగాన మాడుతూ**
**వెన్నెల రేయిలో పిల్లంగోవిలా పాడే గూడ**
**ఇవాల పరాయితనానికి బానిసైపోయింది**
**పోడు వ్యవసాయానికి దూరమై.. ఫలసేకరణ భారమై**
**కోటా బియ్యం కోసం ఎదురుజూస్తోంది కొండ జనం**
**విప్పసారా మత్తులో తూలుతూ తుళ్ళుతూ**
**ఏ మలిజాములోనో సేద దీరాల్సిన గూడ**
**ఇంటి మీద కేబుల్ గద్దె రెక్క విప్పాక**
**నీలి నీడల నగ్న దేహమై చిందులేస్తోంది!'**

'మంటి దివ్వ', ' మట్టిరంగు బొమ్మలు ' కవితా సంపుటాల తర్వాత వెలువరించిన మూడో కవితా సంపుటి ' శతర'. ప్రత్యేకంగా ఆదివాసీ కవిత్వం పేరిట ప్రచురించిన ఈ కవితా సంపుటికి ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ఆచార్యులు జయధీర్ తిరుమల రావు, ఉత్తరాంధ్ర జీవితాల్ని కథల ద్వారా, నవలల ద్వారా అవిశ్రాంతంగా రాస్తున్న ప్రసిద్ధులు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరు నాయుడులు రాసిన ముందు మాటల్లో ఈ ప్రాంత చరిత్రను, ఈ కవితల విశిష్టతలను వివరించారు. ఆదివాసి గిరిజనుల బతుకు వెతలకు అక్షర దర్పణాలు ఈ సంపుటిలోని కవితలు. ఏజెన్సీ ప్రాంతంలోని అలజడులు, యుద్ధాలు, మరణాలు, వలసవాద దోపిడీలు, పెరుగుతున్న అరాచకాలు, అత్యాచారాలు, నయవంచక మోసాలు, కుట్రలు కుతంత్రాలను ఇతివృత్తాలుగా మల్చుకొని కవిత్వం ద్వారా వ్యక్తపరిచారు కవి. ఆయన భావాలతో మనమంతా ఏకీభవించకుండా ఉండలేము. ' సుమారు రెండు దశాబ్దాల నాయీ అటవీ జీవితపు అలజడంతా నాలో సుళ్లు తిరిగీ తిరిగీ.. చెమ్మగిల్లిన కళ్ళల్లో కన్నీరై మరిగీ మరిగీ.. నేను చూసిన వేదనల్నీ .. సంవేదనల్నీ.. దుఃఖపూరిత సందర్భాల్నీ.. ఆయా జీవిత శకలాల్లోకీ పరకాయ ప్రవేశం జేసీ.. పుట్టెడు దుఃఖంతో.. ఒక్కొక్కపరి పట్టరాని ఆగ్రహంతో జెప్పేందుకు యత్నించేను..' అని సిరికి స్వామి నాయుడు ' అడవిపుడొక పొగులుతున్న పచ్చి గాయం ' అంటూ రాసుకున్న తన అనుభవాల ఈ వాక్యాలు అక్షర సత్యాలు. ' చీకటి గర్భంలోంచి/ఒక వేకువ రేఖ/మండే అడవి/మైదానానికి వినిపించిన పొలికేక/ వస్తారా.. ఎవరైనా../నాతో పాటీ గిరిజన తండాల్లోకీ/ కొండల మీద నెగళ్లను/జనం గుండెల్లో రగిలించటానికీ ' అని ' పొలికేక ' ద్వారా ' శతర ' ఆదివాసీ కవిత్వంలోకి ఆత్మీయంగా పిలుస్తున్న స్వామి నాయుడుతో కరచాలనం చేద్దాం పదండి..!

- గోపగాని రవీందర్, 9440979882

## తప్పిన... కాలం



ఆకాశాన్ని అందుకోవాలని లేదు
అవకాశం చేతులు విడిచిభూమిని
కరచాలనం చేసిన వేళ... అడుగులు ఎక్కడో

ఈ శతాబ్దం అత్యంత అమానవీయమైనది..
మనుషులు.. కరెన్సీలను ఆలింగనం
చేసుకున్నాక
అస్తమించిన మనిషి భూమిని
వెంటాడుతుంటాడు.
సూర్యుడు .. నీడల వెంట మోకరిల్లిన
మెంటార్

ఎవడో... రాత్రిని దొంగలిస్తాడు
కులాంకిలిక..మతాంకిలిక కాలాన..
ఆకాశంవలసపోతుంది..

గూగుల్ నీవిఫల నేత్ర కలల్ని మార్మికంగా
అనువదిస్తుంది.

ఎవడు వీరుడు.ఇంకెవడు బాహు బలి
అంతా డైకోటామి...
ఇది విషాదాంత నాటకం
ప్రేక్షకుడు .. బహుళార్థి
నిఘంటువులో అర్థం దొరకని కాలం..
నీరే..కన్నీరే కనిపించే..ముఖాలమధ్య ...

- ఎం.వి.రమణ, 99890 00265

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.


# ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ



**ఆదిలాబాద్, మహా:** రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ ఎంపీ సోయం బాపూరావు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు అదివాసీ నేతలతో కలిసి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ర్యాలీ లో పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో నాయకులు తొలుత కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కొమురం భీం చౌరస్తా నుండి సమావేశ స్థలం ఎస్టీయూ భవన్ వరకు పాదయాత్ర చేశారు. ఈ ర్యాలీలో వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు భారీ స్థాయిలో హాజరయ్యారు. సమావేశం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యుడు, రాజ్ గోండ్ రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు చేసిన సేవల గురించి ప్రశంసించారు.

## రాయపోలులో ఘనంగా నాభిశిలా పండుగ

### ప్రజలు సంతోషంగా ఉండాలి.. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి మహా:** రాయపోలు గ్రామంలో వైభవంగా బొడ్రాయి బోనాల పండుగ గ్రామ ప్రజలు నిర్వహించడం జరిగింది. ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో రంగ రంగ వైభవంగా నిర్వహించిన నాభిశిల (బొండ్రాయి) 3వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హజరై బొండ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో వర్షాలు విరివిగా కురిసి సిరి సంపదలతో, ఆయుఆరోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని భగవంతుని కోరడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీల చైర్మనులు చిలుక మదుసూధన్ రెడ్డి, కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షులు మంఖాల దాసు, నాయకులు సుంకరి రాములు, జంగారెడ్డి, డి రాజు, టీ మహేష్, సికిందర్ రెడ్డి ప్రజలు పాల్గోన్నారు.

# ఘనంగా సీత్లా పండగ

### సాంప్రదాయ దుస్తుల్లో యువతులు



**ఆమనగల్లు, మహా:** గిరిజనులు ప్రతి ఏటా నిర్వహించే సీత్లా పండుగను వైభవంగా జరుపుకున్నారు.ఆమనగల్లు,తలకొండపల్లి, కడ్తాల్ మండలంలోని గిరిజన తండాలలో ఆదివారం సాయంత్రం సీత్లా సంబురాలు అంబరాన్నంటాయి. గిరిజన, సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింభించేలా సీతా పండుగను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. గిరిజన మహిళలు, యువతులు, సాంప్రదాయ దుస్తులను ధరించి తాండాలో భారీ ర్యాలీ నిర్వహించారు.సప్త మాతృకలైన మెరామ,తొల్జ,మంత్రాల్,కంకాళి,హింగ్ల,ద్వార్లగర్,సిత్లభావనిలను పూజిస్తారు. గిరిజనుల సిత్ల పండుగ ప్రతీకగా ప్రతి ఇంటి నుంచి తీసుకవెళ్లిన నైవేద్యాన్ని తాండా శివారులోని కుల దేవతలకు సమర్పించారు. నృత్యాలు ఆడారు. ఆనందోత్సాహల మధ్య వేడుకలు జరిగాయి. పంటలు బాగా పండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



**ఆమనగల్లు, మహా:** మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా మండలంలోని అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ,మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని అబ్దుల్ కలాం ఆజాద్ చేసిన సేవలను గుర్తు చేస్తూ, దేశం కోసం సేవ చేసిన మహనీయల జీవితాలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకెళ్తే జీవితంలో ప్రతి ఒక్కరు విజయం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్అధ్యక్షుడు నర్సింహ, ఏఎంసీ డైరెక్టర్ నరేష్ నాయక్,నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శంకర్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, రామచంద్రనాయక్, మాలే మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు క్యామ రాజేష్, షాబుద్దీన్, జాంగిర్ అలీ, జాంగిర్ బాబా, యాదగిరి రెడ్డి, శ్రీను, అజ్గర్ అలీ, అకృతి నాయక్, కేశవులు, సుధాకర్ గౌడ్, ఇమ్రాన్, చంద్రశేఖర్, రాజేందర్ గౌడ్, శ్రీశైలం,యాదయ్య, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక వృద్ధి కోసం కృషి చేస్తుంది

### బెల్లంపల్లి స్వయం సహాయక సంఘాలకు 25 కోట్ల రూపాయలు

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక వృద్ధి కోసం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఆర్. పి. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సంబరాలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ తో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగుతుందని వెల్లడించారు. బెల్లంపల్లిలో ఇప్పటివరకు స్వయం సహాయక సంఘాలకు 25 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డు కలిగిన వారు, రేషన్ కార్డు లేని వారు రేషన్ కార్డులో సభ్యుల చేర్పుల కొరకు అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు స్పష్టం చేశారు. రేషన్ కార్డు కొరకు అందిన దరఖాస్తులను ఆర్.ఐ., తహసిల్దార్, జిల్లా పౌరసరఫరాల శాఖ స్థాయిలలో పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మండలంలో 1509 నూతన రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని అన్నారు. 2806 మంది సభ్యులను రేషన్ కార్డులలో చేర్పించడం జరిగిందని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అందని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఒక రేషన్ కార్డు నుండి ఒక విద్యుత్ కనెక్షన్ కు మాత్రమే పథకానికి వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సాధిస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం 3 వేల నుండి 3 వేల 500 మంది విద్యార్థులు పాఠశాలలలో చేరుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 7 వేల మంది పిల్లలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేరారని ఆనందం వ్యక్తం చేశారు.

ఇందులో వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి ఉందన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే మహిళా శక్తి భవన్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రుణభీమా పథకంలో 13 మందికి 30.17 లక్షల రూపాయలు, ప్రమాద భీమా క్రింద 4 మందికి 40 లక్షల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. స్త్రీ నిధి పథకంలో 16.49 కోట్ల రూపాలు లక్ష్యం కాగా 6.8 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా రైతు భరోసా పథకంలో బెల్లంపల్లిలోని 47 వేల 500 మంది రైతుల ఖాతాలను 70 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. గృహ జ్యోతి పథకంలో 32 వేల 891 మందికి లబ్ధి చేకూరిందని, మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు పథకం కొరకు 300 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల 565 రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలుచేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించి ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం చెక్కులు, రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ కార్డులు, గౌడ కులస్తులకు కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేశారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాల మహిళల చే ఏర్పాటు చేసిన వివిధ వంటకాల స్టాల్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, బెల్లంపల్లి మండల తహసిల్దార్ కృష్ణ తదితరులు హాజరయ్యారు.



## పేకాట స్థావరంపై దాడి 7 వ్యక్తుల అరెస్టు

### 38,150 రూపాయల నగదు..6 సెల్ ఫోన్లు,2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి శాంతినగర్ కాలనీలో పేకాట స్థావరంపై దాడి 7 వ్యక్తులను అరెస్టు చేసి 38,150 రూపాయల నగదు, 6 సెల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మందమర్రి పట్టణం శాంతినగర్ కాలనీ నివాసి శివ అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామని పేర్కొన్నారు. ఈ దాడిలో దుర్గారావు, నర్సయ్య, శివ, రవి, రమణ, మేకల శంకర్, కుమార్ లను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతున్నామని అన్నారు. రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా పటిష్టమైన నిఘ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుమానిత వ్యక్తులు వాడలలో కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ దాడిలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజశేఖర్ ను, ఏ ఎస్ ఐ మిలింద్ కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, విశ్వనాథ్, కృష్ణ, చైతన్యలను సీఐ శశిధర్ రెడ్డి అభినందించారు.



## కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### మంత్రి శ్రీధర్ బాబు

**కాటారం, మహా :** కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భవిష్యత్ లో పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని ఎవరూ అధైర్యపడవద్దని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య కార్యవర్గ తిరుమల, కమిటీ సభ్యులు ఆదివారం రాత్రి మంత్రిని కలిసి ఒక్కొకరుగా సన్మానం చేశారు. రాబోయే కాలంలో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ శ్రేణులకు తెలిపారు. పదవులు ఆశించిన నాయకుల వద్దకు ఇంటికి వెళ్లి కలిసి మాట్లాడాలని పదవులు వచ్చిన సమయంలో అందరూ హుందాగా కలుపుకొని పనిచేయాలని కాంగ్రెస్ శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేశారు. ప్రతి పక్ష పార్టీలో నాయకులు విమర్శించినప్పుడు అదే స్థాయిలో నాయకులు, కార్యకర్తలు మాట్లాడాలని ఆదేశించారు. కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిర్మల సమ్మయ్య ,వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, డైరెక్టర్ లు రామగుండం శ్రీనివాస్, పిల్లమారి రమేష్, మహేష్ తిరుపతిరావు, ఇర్షాద్, ములకల శ్రీనివాస్ రెడ్డి, గోమాస సడువలి, పోత రామకృష్ణ, దాసరి సంతోష్, జాటోత్ రాజారాం నాయక్, పాగె రాజయ్య, ముక్క శ్రీనివాస్, నడిపెల్లి భారతిలు శ్రీధర్ బాబును ఒక్కొక్కరుగా శాలువాతో సత్కరించారు.

**గ్రంథాలయ చైర్మన్ రాజబాబు కు సన్మానం**

ఉప్పలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబును మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానం చేశారు. పాలపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న కాటారం మండల కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్ రెడ్డి లు రాజబాబును శాలువాతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో మహాదేవపూర్ ఇంజన్ విండో చైర్మన్ చల్లా తిరుపతి రెడ్డి, కటుకం అశోక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అయిత రాజిరెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు ఆంగోతు సుగుణ,మాజీ ఎంపిటిసి విజయారెడ్డి, ఎలుబాక సుజాత, సుశీల, గంట లక్ష్మీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గోవిందాయిపల్లి తండాలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

### ఆకట్టుకున్న శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు

### ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.తండాలోని గిరిజనుల ఆరాధ్యదైవమైన ముత్యాలమ్మ ఆలయంలో ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం తండాలోని ప్రధాన వీధులగుండా అమ్మవారి విగ్రహాంతోపాటు,సేవాలాల్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తు గిరిజన మహిళలు, యువతులు బోనాలను ఊరేగించి అమ్మ వారికి సమర్పించారు.బోనాల సందర్భంగా గిరిజన యువతీ, యువకులు, మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాల పండుగకు హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక అని తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీలు, గూడూరు శ్రీనివాసరెడ్డి, లచ్చి రామ్ నాయక్, మాజీ సర్పంచ్ ఎల్ ఎన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సంతోష్‌నాయక్, రామకృష్ణ, ఆలయ చైర్మన్ శత్రు నాయక్, వైస్ చైర్మన్లు, సభావాట్ రాములు , బాణావత్ సాయి లాల్, పాత్లావత్ మన్య, సభావత్ నిరంజన్, సభావాట్ సేవ్యా , శంకర్ , పూజారి తావ్రియా, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుప్పట్లు పంపిణి



**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామ సమీపంలో ఉన్న జామియా ఇస్లామియా దారుల్ ఉలుం కైసర్ మదర్సా పాఠశాల విద్యార్థులకు మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో మదర్సా ప్రిన్సిపాల్ మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రి, స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఖలీల్ మాట్లాడుతూ దుప్పట్లు పంపిణీ చేయడం ద్వారా విద్యార్థులకు చలికాలంలో వెచ్చదనం అందించాలనే ఉద్దేశ్యం తో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,ఈ కార్యక్రమం ద్వారా, చలికాలంలో విద్యార్థులకు వెచ్చదనం అందించడం మాత్రమే కాకుండా, సమాజంలో వారి పట్ల మరింత సానుభూతి మరియు సహాయం అందించాలనే భావనను కూడా పెంపొందిస్తుందని, ప్రతి ఒక్కరూ, విద్యార్థుల సంక్షేమం కోసం పాటుపడాలని, వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మహబూబ్,ఫారూఖ్, రఫీ, హనీఫ్,నిజాముద్దీన్ బాబా, అబ్బు,కలీమ్, అప్సర్, అజీమ్,హాఫిజ్,అఫ్రోజ్,హైమద్,ముస్తఫా, ఇర్ఫాన్, షోయేబ్, సోహెల్,మేరాజ్,తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం కౌశిక్ రెడ్డి శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కొరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరవుతుంటే బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేక ఇలా అనుచిత వాక్యాలు చేస్తున్నారు. మరోసారి ఇలాంటి ఆరోపణలు యూత్ కాంగ్రెస్ సహించేది చేయలేదని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలన్నారు.



## యూటర్న్ తెరిపించాలి

### ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి పత్రాలు

**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పలి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్, ప్రగతి నగర్, ఆదర్శనగర్, టాటా నగర్, రామకృష్ణ హిల్స్ కాలనీ, సుమారు 20వేల జనాభా గల తమకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. షోలేటరీ స్కూల్ వద్ద గతంలో ఉన్న యూటర్న్ యధావిగా కొనసాగించాలని ఆదివారం పలు కాలనీవాసులు సోమ శ్రీనివాస్, అక్యం రఘు యాదవ్, కాళిదాసు, జగన్, శ్రీశైలం, సురేష్, సాగర్, మల్లేష్, హనుమంతు, పలు కాలానికి సంబంధించిన యువకులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో కలిసి గతంలో ఉన్న యూటర్న్ అలాగే కొనసాగించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు లక్ష్మణ్ రెడ్డి, సోమ సందీప్ గుప్తా, సురేష్, శంకర్, నవీన్ గుప్తా, రవి, మల్లు శేఖర్, రఘువీర్, రాజకుమార్, ఆకుల శ్రీనివాస్ గుప్తా, సింహాద్రి, ఆనంద్ సాగర్, సునీల్, సన్నీ, నాగబాబు తదితరులు పాలొగొన్నారు.

## మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేం..

### కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రాజేంద్రనగర్, మహా :** అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని హైదర్షాకోట్ లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలును గుర్తు చేశారు. దేశ రక్షణ వ్యవస్థకు అనుశక్తిని జోడించిన మిసైల్ మ్యాన్. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశ ప్రతిష్టతను ఇనుమడింపజేసిన ఆధునిక మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్, రాంప్రసాద్, లక్ష్మణ్ ,సిద్దు, విష్ణు ,శ్రీనివాస్ ,వేణు ,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మన్ కి బాత్‌ని వీక్షించిన బీజేపీ నాయకులు



**రాజేంద్రనగర్, మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీ 124వ మన్ కి బాత్ కార్యక్రమం మైలార్ దేవ్ పల్లి డివిజన్ ఆనంద్ నగర్ లో మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రెసిడెంట్ గోద పాండు యాదవ్ బిజెపి నాయకులతో కలిసి ఆదివారం వీక్షించారు. దేశ అభివృద్ధి, యువతకు మార్గదర్శనం, పర్యావరణ పరిరక్షణపై ప్రేరణాత్మక సందేశాలను తెలిపారు. యువతకు మార్గదర్శం చేశారు. ప్రపంచ దేశాలతో అభివృద్ధిలో పోటీపడుతూ రక్షణ రంగాన్ని ప్రతిష్టంగా చేశాము. స్వచ్ఛభారత్ తో తమ బస్తీలను గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తుందన్నారు. దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ప్రభుదాస్, మైనార్టీ మోర్చా నాయకులు మాజహార్,పవన్ పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో వీకెండ్ రేవ్ పార్టీ

- యువతులతో అశ్లీల నృత్యాలు
- భగ్నం చేసిన ఎక్సైజ్ ఎస్ వోటీ అధికారులు
- భారీగా డ్రగ్స్ స్వాధీనం
- 9 మంది నిందితులు అరెస్ట్



**హైదరాబాద్, మహా :** ఇప్పటి వరకు హైదరాబాద్ నగర శివార్లకు పరిమితమైన రేవ్ పార్టీల సంస్కృతి ఇప్పుడు నగరం నడిబొడ్డుకు పాకింది. వీకెండ్ వచ్చిందంటే చాలు.. యువతను టార్గెట్ చేసుకుని కొన్ని ముఠాలు సర్వీస్ అపార్ట్‌మెంట్లలో మద్యం, మటన్ విందులు, డ్రగ్స్ వినియోగం, అమ్మాయిల అర్ధనగ్న నృత్యాలతో రేవ్ పార్టీలు నిర్వహిస్తూ విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. తాజాగా.. కొండాపూర్‌లోని ఎస్‌వీ నిలయం అనే సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఇలాంటి ఓ రేవ్ పార్టీని శనివారం రాత్రి ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి భగ్నం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొన్ని ముఠాలు, ముఖ్యంగా విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివం రాయుడు వంటివారు, మారుపేర్లతో.. నకిలీ ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లతో బడా బాబులను హైదరాబాద్‌కు తీసుకువచ్చి రెండు రోజులపాటు ఈ రేవ్ పార్టీలను నిర్వహించి వెనక్కి పంపుతున్నట్లు సమాచారం. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించిన ఎస్టీఎఫ్ బీటీమ్ రేవ్ పార్టీని భగ్నం చేసింది. రేవ్ పార్టీలో పాల్గొన్న వారితో పాటు నిర్వాహకులు పలువురిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్టీఎఫ్ సీఐ సంధ్య తెలిపారు. పోలీసులు వారి వద్ద నుంచి 2.080 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయి, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చరస్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు నాలుగు కార్లు, 11 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ దాడుల్లో డ్రగ్స్ సరఫరాదారురాహుల్, ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నే (ఆర్గనైజర్), అశోక్ కుమార్, సమ్మెల సాయి కృష్ణ (ఆర్గనైజర్), హిట్ జోసఫ్, తోట కుమారస్వామి, అడపా యశ్వంత్ శ్రీ దత్, సమత, తేజ అనే 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేయగా..వారు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ రేవ్ పార్టీలో యువతులతో అర్ధనగ్న నృత్యాలను చేయిస్తున్నట్లు బయటపడిందని అధికారులు తెలిపారు. మరింత సమాచారాన్ని రాబట్టేందుకు అధికారులు విచారణ జరుపుతున్నారు.




# ఆదివాసీ మారణ హోమాన్ని నిలిపివేయాలి

## మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి

**కాటారం, మహా :** ఆదివాసి మరణ హోమాన్ని ఆపరేషన్ అగర్ను నిలిపి వేసేందుకు మావోయిస్టులతో వెంటనే కేంద్ర ప్రభుత్వం బెక్షరతుగా చర్చలు జరపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ తో సాగుతున్న ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా ఆదివారం కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభ నిర్వహించారు. కన్వీనర్మ డిమడుగుల మల్లన్న అధ్యక్షత వహించారు.. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మాట్లాడుతూ 1996 పేసా చట్టం, 2006 అడవి హక్కుల చట్టాన్ని అమలు పరచకుండ నరమేధాన్ని కొనసాగిస్తూ ఆదివాసీల ఉద్యమాలకు నిశ్శబ్దం చేసి వనరులను కార్పొరేట్లకు అందించడానికి చేస్తున్న మోడీ, అమిత్ షా చేస్తూన్న ఆర్థిక విధానాలను ఖండించారు. గత పదిహేను నెలల కాలంలో 600 మంది అమాయక ప్రజలను బూటకపు ఎన్ కౌంటర్ పేరిట చంపారని ఆరోపించారు. వేదిక కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివాసీ అడవి ప్రాంతంలో సైన్యాన్ని దింపడం కోసం, వనరులను రవాణా చేయడం కోసం రోడ్డును నిర్మించి ఇదే అభివృద్ధి అని ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఇది ఆదివాసీలా అభివృద్ధి కి ఎలాంటి ఉపయోగం లేదని కనీసం వారికీ సైకిల్ లు కూడా లేవని అన్నారు. అంతే కాకా భేటీ బచావో భేటీ పడావో అని నినాదం ఇస్తూ అడవిలో ఆడబిడ్డలను చంపుతున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీ తో తప్పనిసరిగా చర్చలు జరిపి ఉద్యమకారుల, ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని, అంతేకాకుండా మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాంతి చర్చలు జరిపి ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.



## యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలి

### గోలి శ్రీనివాస్ రెడ్డి

**ఆమనగల్లు, మహా :** యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆమనగల్లు మున్సిపాలిటీపరిధిలోనివిటాయిపల్లి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైత్ర మెస్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలో వెళ్లకుండా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఏదైనా రంగాన్ని ఎంచుకొని ఆయా రంగాల్లో ఉన్నతంగా రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ సూరమల్ల సుభాష్,బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి,బిఆర్ఎస్ మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డెమోని శివ కుమార్, కొమ్ము ప్రసాద్, సతీష్, సుమన్ నాయక్,శ్రీను తదితరులు ఉన్నారు.

## శతాధిక వృద్ధురాలు బేతి సమ్మక్క అస్తమయం

### సంతాపం తెలిపిన కార్పొరేటర్ మరుపల్ల రవి

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 40వ డివిజన్ లోని ఉర్సు దర్గా ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు 103 సంవత్సరాల బేతి సమ్మక్క ఆదివారం పరమపదించారు. ఈమెకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు 50 మంది మనవళ్ళు ముని మనవళ్లతో సంపూర్ణ జీవనాన్ని కొనసాగించిన సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో పరమపదించారు మంచికి మారుపేరు, చిరునవ్వుల పలకరింపుతో ఈ ప్రాంతంలోని అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న సమ్మక్క మరణాన్ని తెలుసుకున్న 40 డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, తోట సంపత్ కుమార్, పొన్నం హరినాథ్, రాజేశ్వర్ ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.



# తెలంగాణ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి
- కర్మన్ ఘాట్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

**ఎల్బీనగర్,మహా :** ప్రసిద్ధ కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సతీ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రికి అలయ ఈవో లావణ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణ గారు, ధర్మకర్తలు,అర్చకులు సాంప్రదాయ పూర్వక పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... కర్మన్ ఘాట్ హనుమాన్ స్వామివారు భక్తుల కోరికలు తీర్చే దేవుడు అని అన్నారు. ఎన్నికల ముందు తాను కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో స్వామివారికి పూజలు చేశానని, నా మొక్కులు తీర్చారని తెలిపారు. నాకు మంత్రి పదవి, నా కుమారుడు ఎంపీగా గెలిచారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎంపీగా రేవంత్ రెడ్డి స్వామివారికి పూజలు చేశారని, స్వామి దయతో ఆయనే సీఎం అయ్యారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సిరిసంపదలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు చెప్పారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలు చేస్తానన్నారు. కర్మన్ ఘాట్ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కర్మన్ ఘాట్ ఆలయాభివృద్ధికి కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. అనంతరం తెలంగాణ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవాచారి ఇంటివద్దకు వెళ్లి అక్కడ స్వర్ణకారులకు హామీ ఇచ్చారు వారి సమస్యలను రాఘవాచారి ద్వారా తెలుసుకొని త్వరలో పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

## మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా

# మొక్కలు నాటాలి

### తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి బెడద వీరన్న

**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి బెడద వీరన్న ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించాలని తెలంగాణ అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ను కోరగా మొక్కలు నాటే కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని మీరు చేసే కార్యక్రమానికి ప్రభుత్వపరంగా సహకారం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం కిల వరంగల్ తూర్పు కోట ప్రాంత అధ్యక్షులు బంగారు దయాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బరిగేల శ్రీనివాస్ సహాయ కార్యదర్శి బైరబోయిన ప్రకాష్ జిల్లా కార్యదర్శి బోలుగోడు ఉపేందర్ ప్రధాన కార్యదర్శి గీకురు శ్రీనివాస్ కాగిత శ్రీనివాస్ కోదూరి యాకూబ్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అధ్యక్షులు అల్లు అర్జున్ రాజు రామ్ చరణ్ ఫాన్స్ అధ్యక్షులు సిరబోయిన శివ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు బంగారి రాజు మధ్యకోట సంబంధించిన చిరంజీవి ఫ్యాన్స్ మాజీ టౌన్ అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తీగల



అమర్ గౌడ్ చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు లక్ష్మణ్ చిరంజీవి ఫ్యాన్స్ 38 వ డివిజన్ అధ్యక్షులు గోపి ముదిరాజ్ నలిగింటి నవీన్ నరేష్ యజ్ఞ మోహన్ జార్జి రాజు రామ్ చరణ్ యువత సిరబోయిన గిరి దేవర రాజు అంకతి జ్యోతిబోస్ మూడిదే రఘు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కందిమల్ల భూషణ్ సిరబోయిన కిరణ్ చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా సహాయ కార్యదర్శి వంగ సాంబయ్య వీరి ఆధ్వర్యంలో ఆగస్టు 15వ తారీకు 11 గంటలకు చింతల్ వాకింగ్ గ్రౌండ్ నుండి తూర్పుకోట హనుమాన్ జంక్షన్ వరకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ అధ్యక్షులు కార్యదర్శులు డివిజనల్ అధ్యక్షులు అభిమాన సంఘాల నాయకులు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బెడద వీరన్న పిలుపునిచ్చారు.

## పెద్దఅంబర్ పేట్ లో పౌల్ట్రీ ఫెడరేషన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఓపెనింగ్

### ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి



**ఎల్బీనగర్,మహా:** రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లో తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఫెడరేషన్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్డింగ్ నిర్మాణం పౌల్ట్రీ రైతులకు చక్కటి వరం లాంటిది అన్నారు.పౌల్ట్రీ ఇండస్ట్రీ కమర్షియల్ ఇండస్ట్రీ కాకుండా రైతుల ఇండస్ట్రీగా భావించి ప్రభుత్వం అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తుందని చెప్పారు. ముందు ముందు కూడా పౌల్ట్రీ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ కసర్ల మోహన్ రెడ్డి తో పాటు మాజీ జడ్ పి చైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నాయకుని మెప్పుకోసమే స్థానిక బీఆర్ఎస్ నాయకుల ఆరాటం

### విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు



**కాటారం, మహా :** మంథని మాజీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు పుట్ట మధుకర్ దగ్గర తమ ఉనికిని కాపాడుకునేందుకే స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరాటపడుతున్నారని కాటారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్మదినం రోజు ఒక కార్యక్రమాన్ని తీసుకొని పేద కుటుంబానికి సహాయం చేయడం అంతవరకు బాగానే ఉంది, కానీ మీ నాయకుడు పుట్ట మధు ఏ కార్యక్రమం చేపట్టిన మా నాయకులు మంత్రి శ్రీధర్ బాబు , శ్రీను బాబు లను విమర్శించడానికి ఒక వేదికగా ఉపయోగించుకుంటున్నరని ఆరోపించారు. ఆ వేదిక కోసం మీ నాయకుడు ఎంతగా దిగజారుతున్నాడో మంథని నియోజకవర్గ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రతిరోజు మా నాయకుల పేరు తీయనిదే మీ నాయకునికి పూట గడవదు,అలాంటి నాయకూని దగ్గర మీరు మీ ఉనికి కాపాడుకునేందుకు మా నాయకుడి మీద చిల్లర మాటలు మాట్లాడుతున్నరని అన్నారు. మీ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉంది ఆనాడు మీ పార్టీ మేనిఫెస్టోలో ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి మరియు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కారు, గెలిచిన అనంతరం వాటి ఊసే లేకుండా పోయింది,కమిషన్లు వచ్చే ప్రాజెక్టుల మీద దృష్టి సాధించారు. ఆనాడు మీరు ఇస్తానన్న భూమి మరియు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఆ దళిత కుటుంబానికి ఇస్తే సహాయం ఆశించకపోవును కదా అన్నారు. ప్రభుత్వంలో ఉండి ఏం చేయక మా శ్రీధర్ బాబు చేస్తున్నటువంటి అభివృద్ధిని చూసి తను రాజకీయ సన్యాసం తీసుకోక తప్పదని మతి భ్రమించి ఏ వేదిక దొరికిన అక్కడ మా నాయకుడి మీద సంస్కారహీనంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడు, మా నాయకుడు చేసినవన్నీ చెప్పుకుంటూ పోతే ఒక రోజు చాలదు మేము ఒక చేతితో సహాయం చేస్తే రెండో చేతికి తెలియకుండా చేస్తాం మీ నాయకుడు పదిమందితో కలిసి ఒకరికి సాయం చేసి వంద మందికి చేసినట్టు ప్రచారం చేసుకునే చరిత్ర మీది, మరోసారి మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు లపై,మా కాంగ్రెస్ పార్టీ నాయకుల మీద ఇష్టానుసారంగా మాట్లాడితే ఇక మీదట ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిటూరి మహేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ కుమార్, పసుల మొగిలి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాళేశ్వరంలో భక్తుల పుణ్యస్నానాలు.. పూజలు

**కాటారం, మహా:** ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం లో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు .ఉదయం నుండే త్రివేణి సంగమ తీరం గోదావరి నది పుష్కర ఘాట్ లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు పూజలు చేశారు. గోదావరి నది జలంతో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకములు, శుభానంద దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో వేచి చూశారు. అనుబంధ దేవాలయం సరస్వతి దేవి, రామాలయం, ఆది ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు దర్శనం చేసుకున్నారు.

# జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలి

### విలువలతో కూడిన జర్నలిజం చేయాలి.. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**వరంగల్ మహా;** పాత్రికేయులు సామాజిక బాధ్యతతో విలువలతో కూడిన జర్నలిజాన్ని మాత్రమే చేయాలని తద్వార సమాజంలో ప్రజల ఆదరణ పొందుతామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. వరంగల్ పట్టణంలోని ఉర్స్ కరీమాబాద్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నైతిక నియమాలు మీడియా చట్టాలు అనే అంశంపై మాట్లాడుతూ మీడియా అకాడమీ నిర్వహిస్తున్న పాత్రికేయుల శిక్షణ తరగతుల వల్ల మరింత జ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు కావలసిన శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమీ అన్ని చర్యలను చేపట్టి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు . పాత్రికేయులు నైతిక విలువలు కాపాడుకోవడం తోపాటు పారదర్శకత తో కూడిన వార్తలను ప్రచురించినప్పుడే ప్రజల్లో పాత్రికేయులపై గౌరవం పెరుగుతుందన్నారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలని కోరారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్ నాన్ వర్కింగ్ జర్నలిస్ట్ తదితర అంశాలపై ఆయన విపులంగా తెలియజేశారు. భవిష్యత్తులో పత్రిక నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించబోతుందని, తదనుగుణంగా రాబోవు కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరఫున నిర్వహిస్తామని తెలిపారు. ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా , ధోరణులు ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్తున్నాయని తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం లో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర రావు, టియుడబ్ల్యూజే (ఐ జె యు) అధ్యక్షులు శ్రీ రామ్ చందర్ ప్రధాన కార్యదర్శి మట్టదుర్గా ప్రసాద్, తాళ్ళ పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ డా.వరుణ్, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, పాత్రికేయులు, తదితరులు, పాల్గొన్నారు.




# ఎమ్మెల్సీ కవిత రాణి రుద్రమదేవి విగ్రహాన్ని తాకడం అపచారం

- విగ్రహానికి పూలమాల వేస్తే కవిత పాపాలు పోతాయా
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- రుద్రమ దేవి విగ్రహానికి క్షీరాభిషేకం

**వరంగల్ మహా;** లిక్కర్ స్కామ్ లో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణ వీరనారి అయిన రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేయడం తెలంగాణ సమాజానికే అవమానమని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం పోచమ్మ మైదాన్ లోని రాణి రుద్రమదేవి విగ్రహానికి రవికుమార్ క్షీరాభిషేకం చేశారు. వరంగల్ జిల్లా మహిళా మోర్చా, యువజన మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పసిపాపను నడుముకు కట్టుకొని యుద్ధరంగంలో కదం తొక్కిన రుద్రమదేవికి లిక్కర్ వ్యాపారం చేస్తూ కోట్లు గడించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పూలమాల వేయడం పెద్ద అపచారంగా భావించారు. ఆమె విగ్రహం వద్దకు వచ్చినంత మాత్రాన కవిత చేసిన పాపాలు పోతాయి అనుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. లిక్కర్ స్కామ్ లో జైలుకు సైతం వెళ్లిన కవిత రాణి రుద్రమదేవి విగ్రహం వద్దకు వచ్చి ముక్కు నేలకు రాసి క్షమించమని కోరాలని డిమాండ్ చేశారు. ఆమె విగ్రహాన్ని తాకడం వీరనారిని అవమానించినట్టేనని అందుకే




మహిళ, యువ మోర్చా ఆధ్వర్యంలో రుద్రమదేవి విగ్రహానికి క్షీరాభిషేకం చేసినట్టు స్పష్టం చేశారు. ముఖ్యంగా అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన కల్వకుంట్ల కుటుంబం మహనీయులు, అమరవీరుల విగ్రహాలను తాకే అర్హత కోల్పోయారని రవికుమార్ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో లబ్ధి పొందేందుకే కవిత ఈ డ్రామాలు చేస్తోందని విమర్శించారు. వారు ఎన్ని కుయుక్తులు చేసిన ప్రజలు కవితను ఆమే కుటుంబాన్ని నమ్మే పరిస్థితి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నిక కోసమే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం కొత్త డ్రామాలకు తెరలేపారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్యే కేటీఆర్ పైకి ఎంత తిట్టుకున్నా లోపల వారంతా ఒకటేనని విమర్శించారు. ఫోన్ టాపింగ్ కెసిఆర్, కేటీఆర్ లు జైలుకు వెళ్లడం ఖాయమని వారి అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ప్రజల మధ్య ఉంటున్నట్లు నాటకాలు ఆడుతున్నట్టు విమర్శించారు. అంతే కాకుండా మామునూరు లో త్వరలో నిర్మించబోతున్న విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని అలాకాకుండా విమానాశ్రయానికి ఏ గాంధీ పేరు పెట్టిన సహించేది లేదని హెచ్చరిస్తూనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాకతీయుల చేతితోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించడం బాధాకరమని అన్నారు.

# బెంగళూరులో వర్క్ ఫ్రమ్ హోమ్? పరిశీలిస్తున్న ఐటీ సంస్థలు

దేశ ఐటీ రాజధానిగా పిలిచే బెంగళూరు మహా నగరంలో ట్రాఫిక్ తిప్పలు అన్నీ ఇన్నీ కావు. నాలుగైదు కిలోమీటర్ల ప్రయాణానికే గంటలకొద్దీ సమయం పడుతోంది. నగరంలో ట్రాఫిక్ తగ్గించడానికి ముఖ్యంగా రద్దీగా ఉండే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి దీర్ఘకాలిక ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించడానికి నగర ట్రాఫిక్ పోలీసులు కొత్త ఆలోచనను ప్రతిపాదించారు. బుధవారాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్హెచ్) అమలు చేయాలని అక్కడి ఐటీ సంస్థలకు సూచించారు.



**ఎడతెగని ట్రాఫిక్**

బెంగళూరు ట్రాఫిక్ పరిస్థితి చాలా కాలంగా నగరవాసులకు, ప్రయాణికులకు చిరాకు తెప్పిస్తోంది. బెంగళూరులో ట్రాఫిక్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని 'ఎక్స్'లో ఓ యూజర్ వ్యాఖ్యానించారు. 'నేను ఇంటి నుంచి ఉదయం 9 లేదా 9:30 గంటలకు బయలుదేరితే ఏ 12 గంటలకో ఆఫీసు చేరుకుంటున్నాను. ఇది కేవలం 6 కిలోమీటర్ల ప్రయాణం మాత్రమే! నాకు సొంత కారు ఉన్నా ట్రాఫిక్‌కు భయపడి దాన్ని బయటకు తీసే ఆలోచన కూడా చేయడం లేదు. ఏ ఉబెర్ లాంటిదో బుక్ చేసుకోవాల్సి వస్తోంది. రద్దీ సమయాల్లో వాళ్లు ఒక్కో రైడ్‌కు రూ.500-రూ.600 తీసుకుంటున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'అదృష్టవశాత్తూ మా ఆఫీస్‌లో హైబ్రిడ్ విధానం అనుసరిస్తున్నారు. కానీ ఆఫీస్‌కు బయలుదేరినప్పుడు ఈ గందరగోళాన్ని అనుభవించాల్సి ఉంటుంది. ఇది పనిచేసే ఉత్సాహాన్ని హరిస్తుంది. ఎవరోఒకరు ట్రాఫిక్ లో ఇరుక్కోవడం వల్ల చాలాసార్లు మీటింగ్‌లు వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఆఫీస్‌కి 12 కిలోమీటర్ల పరిధిలో నివసించే సహోద్యోగులు కూడా క్యాబ్‌లలో వచ్చి ఆ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం ఎందుకని నడిచి వస్తున్నారు. బెంగళూరు లాంటి నగరానికి ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు' అని పేర్కొన్నారు.

**ఉదయం విపరీత ట్రాఫిక్**

పలు ప్రధాన ఐటీ పార్కులు, కంపెనీలకు నిలయమైన ఓఆర్ ఆర్ పై ఒత్తిడిని తగ్గించే చర్యల్లో భాగంగానే ఈ ప్రతిపాదిత డబ్ల్యూఎఫ్ హెచ్ ప్రణాళికను రూపొందించినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని జాయింట్ కమిషనర్ ఆఫ్ ట్రాఫిక్ కార్తీక్ రెడ్డి తెలిపారు. ఈ ఒత్తిడిని తగ్గించడానికి కంపెనీలు ఉదయం 7.30 గంటలకే పనివేళలను ప్రారంభించాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వారం మధ్యలో అంటే బుధవారం వర్క్‌ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని ట్రాఫిక్ అధికారులు సిఫార్సు చేస్తున్నారు.

**వ్యూహం ఇదీ..**

ట్రాఫిక్ విభాగం, బీబీఎంపీ (నగర కార్పొరేషన్), బీఎంటీసీ (బస్ సర్వీస్), ఐటీ రంగానికి చెందిన కీలక భాగస్వాములతో కూడిన సంయుక్త సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చించారు. ఓఆర్ ఆర్ వెంబడి పెండింగ్ లో ఉన్న రోడ్డు పనులను వేగవంతం చేయడం, ప్రత్యేక బస్ బేల ఏర్పాటు, ప్రధాన టెక్ పార్కుల మధ్య కనెక్టివిటీని మెరుగుపరచడం సహా అత్యవసర మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ లపై సమావేశంలో చర్చించారు. ఈ ప్రతిపాదనలపై ఐటీ కంపెనీలు కూడా పరిశీలిస్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే వారంలో ఒక్కరోజైనా నగరంలో ఎంతో కొంత ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది.



# ఇప్పుడు ఇల్లు కొనాలంటే ఇవి ఉండాల్సిందే..


ఇప్పటివరకు ఫ్లాట్‌ను విక్రయించాలంటే క్లబ్ హౌజ్, స్విమ్మింగ్ పూల్, ఏసీ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలిస్తే చాలనుకునే వారు బిల్డర్లు. కానీ, ఇప్పుడలా కుదరదు. ఎందుకంటే కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులొచ్చాయి. తమ పిల్లలు చదువుకునేందుకు పాఠశాల, ఆధునిక ఆస్పత్రి వంటివి కూడా ఉంటేనే ఫ్లాట్ కొంటామంటున్నారు. అవి కూడా ప్రాజెక్ట్ దగ్గర్లో కాదు ఏకంగా ప్రాజెక్ట్ ఆవరణలోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో బిల్డర్లు బడిబాట పడుతున్నారు. ప్రాజెక్ట్‌ల్లో ఫ్లాట్లే కాదు పాఠశాల, ఆస్పత్రి వంటివి కూడా నిర్మిస్తున్నారు. నగరంలో ఈ తరహా నిర్మాణాలు క్రమంగా పెరుగుతున్నాయి. సొంతింటి ఎంపికలో విద్యాలయాలు, ఆస్పత్రులు కీలకంగా మారుతున్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రికి వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణం చేయడం, వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి నుంచి కిలోమీటర్ల దూరముండే స్కూల్‌కు తమ పిల్లలు పంపించడం తల్లిదండ్రులు ఏమాత్రం ఇష్టపడట్లేదు. అందుకే ఫ్లాట్‌ను కొనుగోలు చేసేముందు పిల్లల అవసరాలు, ఆరోగ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. మరీ ఎక్కువగా వర్షాకాలంలో బస్సుల కోసం వేచి చూడటం తల్లిదండ్రులకు చిరాకు కలిగిస్తోంది. పిల్లలు వర్షంలో తడవకుండా ఇంటి నుంచే నేరుగా పాఠశాలకు వెళ్లగలరా? హఠాత్తుగా అనారోగ్యం తలెత్తితే వెంటనే ఆస్పత్రికి వెళ్లేందుకు వీలుగా ప్రాజెక్ట్‌లోనే ఆస్పత్రి ఉందా? వంటి అంశాలను తెలుసుకుంటున్నారు. అందుకే ఫ్లాట్‌ను కొనేముందు క్లబ్ హౌజ్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి ఆధునిక సదుపాయాలే కాదు ప్రాజెక్ట్ ఆవరణలోనే పాఠశాల, ఆస్పత్రి వంటివి ఉంటేనే ఫ్లాట్ కొనేందుకు ముందుకొస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

**శరవేగంగా అభివృద్ధి..**


కొనుగోలుదారుల అభిరుచిలో వచ్చిన మార్పుతో ఆయా ప్రాజెక్ట్‌లు ఉండే ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఎలాగంటే కొనుగోలుదారుల కోసం, తమ వ్యాపారం కోసం తమ ప్రాజెక్ట్ ఆవరణలో పాఠశాలలు, ఆస్పత్రులు నెలకొల్పేందుకు బిల్డర్లు ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటారు. కొన్ని కంపెనీలైతే ప్లే స్కూళ్లు, రీసెర్చ్ సెంటర్లకూ ప్రాజెక్టుల్లోనే స్థానం కల్పిస్తాయి. దీంతో ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతం విద్యాలయాలు, ఆస్పత్రులతో కళకళలాడతాయి. దీంతో దేశ, విదేశీ కంపెనీలు ఆయా ప్రాంతాల్లో షాపింగ్ మాళ్లు, మల్టీప్లెక్స్‌ల వంటివి ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయి. దీంతో ఆయా ప్రాంతాలు రియల్ బూమ్‌తో శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.

## టీసీఎస్.. భారీగా లే ఆఫ్స్..
# ఎవరిపై ప్రభావమంటే..!

**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజ సంస్థల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) భారీ లే ఆఫ్స్‌కు సిద్ధమైంది. ప్రస్తుతం సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులు కారణంగా భారీ తొలగింపునకు టీసీఎస్ సన్నద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా టీసీఎస్ కంపెనీల్లో పని చేస్తున్న ఉద్యోగాల్లో 2 శాతం లే ఆఫ్స్ కు సిద్ధమైన విషయాన్ని కంపెనీ ఆదివారం స్పష్టం చేసింది. అంటే 12వేలకు పైగా ఉద్యోగులు తమ ఉద్యోగాల్ని కోల్పోనున్నారు. ఇది మధ్యస్థంగా ఉన్న ఉద్యోగులతో పాటు సీనియర్ స్థాయిల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కె కృతివాసన్ స్పష్టం చేశారు. అయితే ఉద్యోగుల్ని తొలగించడం తమకు కూడా బాధగానే ఉందని, కాకపోతే మారిన టెక్నాలజీతో తొలగింపులు తప్పడం లేదన్నారు. కొత్త టెక్నాలజీల పరంగా చూస్తే ముఖ్యంగా ఏఐ ఆపరేటింగ్ మోడల్ మార్పులను గుర్తిస్తున్నాం. పని చేసే విధానాలూ మారుతున్నాయి. అందుకే భవిష్యత్తుకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. అందుకోసం




మేము ఏఐని ఉపయోగిస్తూ కావాల్సిన నైపుణ్యాలను మెరుగుపరిచే పనిలో ఉన్నాం. మా కంపెనీ విస్తరణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఎక్కువ శాతం పెట్టుబడులు పెట్టాం. కానీ, పలు విభాగాల్లో వృద్ధి కనిపించడం లేదు. దాంతో లే ఆఫ్స్ తప్పడం లేదు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మా ఉద్యోగుల్లో సుమారు 2 శాతం మందిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా మధ్యస్థ, సీనియర్ స్థాయిల్లో ఉండే ఉద్యోగులపైనే ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ నిర్ణయం అనుకున్నంత ఈజీ కాదు. సీఈఓగా నేను తీసుకున్న అత్యంత కఠిన నిర్ణయాల్లో ఇదొకటి' అని కృతివాసన్ తెలిపారు.




## హైదరాబాద్‌కు ఐసీఐసీఐ లాంబార్డ్
# డిజాస్టర్ రికవరీ మార్పు

**న్యూఢిల్లీ:** బీమా రంగ సంస్థ ఐసీఐసీఐ లాంబార్డ్ తమ డిజాస్టర్ రికవరీ మౌలిక సదుపాయాలను అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో ఆసియా-పసిఫిక్ (ముంబై) నుంచి ఆసియా పసిఫిక్ (హైదరాబాద్) రీజియన్‌కు అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది. నిర్వహణపరమైన రిస్కులను సమర్థంగా ఎదుర్కొంటూ, కస్టమర్లకు నిరాటంకంగా సేవలు అందించేందుకు ఇది సహాయపడగలదని పేర్కొంది. టెక్నాలజీపరమైన అంతరాయాలు, అంతర్జాతీయంగా ఐటీ పరిశ్రమలో రిస్క్‌లు పెరుగుతున్న నేపథ్యంలో డౌన్‌టైమ్‌ను గణనీయంగా తగ్గించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ తెలిపింది.

# దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL

## విమానం టేకాఫ్ సమయంలో మంటలు..
# భయంతో ప్రయాణీకుల పరుగులు

**వాషింగ్టన్:** అగ్ర రాజ్యం అమెరికాలో తృటిలో పెను విమాన ప్రమాదం తప్పింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం AA3023 ల్యాండింగ్ గేర్‌లో మంటలు చెలరేగడంతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. తమ ప్రాణాలు కాపాడుకునేందుకు రన్‌పై పరుగులు తీశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల ప్రకారం.. కొలరాడలోని డెన్వర్ విమానాశ్రయంలో పెను విమానం ప్రమాదం తప్పింది. మియామాకి వెళ్తున్న అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం AA3023లో మంటలు చెలరేగాయి. బోయింగ్ 737 మాక్స్ 8 విమానం టేకాప్‌కు సిద్ధమవుతున్న సమయంలో (స్థానిక సమయం) మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ల్యాండింగ్ గేర్‌లో సాంకేతిక లోపం కారణంగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. త తర్వాత కొద్దిక్షణాల్లోనే మంటలు చెలరేగాయి. డెన్వర్ విమానాశ్రయ పరిపాలన వెంటనే అగ్నిమాపక శాఖను వెంటనే అప్రమత్తం చేసింది. దాంతో ఫైర్‌స్టాఫ్ వెంటనే విమానం వద్దకు చేరుకొని మంటలను ఆర్పి వేసింది. ఈ ఘటనతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. తమ ప్రాణాలు కాపాడుకునేందుకు విమానం నుంచి కిందకు దిగి.. రన్‌పై పరుగులు తీశారు. మంటలు వ్యాపించిన సమయంలో విమానంలో 173 మంది




ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విమానం నుంచి దట్టమైన పొగలు వస్తున్న సమయంలో పలువురు ప్రయాణికులు ఒక చేత్తో తమ పిల్లలు.. మరోచేత్తో తమ లగేజీతో స్లయిడ్‌పై నుంచి జారుతూ కిందకు వచ్చారు. ఈ ఘటనపై డెన్వర్ విమానాశ్రయం, అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రకటన విడుదల చేశాయి. ఈ ఘటనలో కేవలం ఒక వ్యక్తికి మాత్రమే గాయాలయ్యాయి. సదరు వ్యక్తికి మొదట ప్రథమ చికిత్స చేసి ఆ తర్వాత ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులను అందరినీ బస్‌లో టెర్మినల్‌కు తరలించారు. విమానం టైర్‌కు సంబంధించిన నిర్వహణ విషయంలో ఇప్పటికీ హెచ్చరికలు చేసినట్లుగా ఎయిర్‌లైన్స్ పేర్కొంది. ఈ ఘటన తర్వాత సర్వీస్ నుంచి తొలగించి, దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా విమానయాన సంస్థ ప్రయాణికులకు క్షమాపణ చెప్పింది. అగ్ని ప్రమాదం నేపథ్యంలో విమానాశ్రయంలోని రన్‌వేపై కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. విమానాన్ని రన్ వే నుంచి తొలగించిన తర్వాత మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి.

# ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ చీఫ్ హతం..
## తుర్కియే వ్యక్తిని పెళ్లాడిన సిన్వర్ భార్య

**జెరూసలేం:** గాజాపై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకు పడుతున్న విషయం తెలిసిందే. హమాస్ ఏరివేత లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. దీంతో, గాజాలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఇక, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటికే హమాస్‌కు చెందిన కీలక నేతలు హతమయ్యారు. హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్ సహా కీలక ఉగ్రవాదులు చనిపోయారు. గతేడాది అక్టోబర్‌లో యహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ బలగాలు హతమార్చాయి. అయితే, అంతకుముందే సిన్వర్ సతీమణి పరారైందని తాజాగా వెల్లడైంది. ఆమె.. తుర్కియేకు వెళ్లి అక్కడ మరో వ్యక్తిని వివాహం చేసుకున్నట్టు తెలుస్తోంది. పలు మీడియా కథనాల ప్రకారం.. యహ్యా సిన్వర్ భార్య సమర్ ముహమ్మద్ అబు జమార్ ప్రస్తుతం తుర్కియేలో రహస్యంగా జీవిస్తోందని సమాచారం. గాజాకు చెందిన ఓ సామాన్య మహిళకు చెందిన పాస్ పోర్టు సాయంతో సమర్ తన పిల్లలను తీసుకుని దేశం దాటిందని, తొలుత ఈజిప్ట్ లోకి అక్కడి నుంచి తుర్కియేలోకి ప్రవేశించిందని తెలిపింది. ఆ తర్వాత అక్కడి స్థానికుడిని వివాహం చేసుకుని మారుపేరుతో తుర్కియేలోనే జీవిస్తోందని వై నెట్ వెల్లడించింది. ఈ మొత్తం వ్యవహారం హమాస్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేసే నెట్ వర్క్ సాయంతో జరిగిందని పేర్కొంది. ఇదే మార్గంలో యహ్యా సిన్వర్ సోదరుడి భార్య నజ్వా కూడా దేశం దాటిందని తెలిపింది. అయితే, నజ్వా ఏ దేశంలో ఆశ్రయం పొందిందనే వివరాలు తెలియరాలేదని వివరించింది. అయితే, హమాస్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో సిన్వర్ మరణించడానికి ముందుగానే సమర్ తన పిల్లలతో కలిసి దొంగ పాస్ పోర్టుతో దేశం దాటినట్లు గాజాలోని హమాస్ వర్గాలు వెల్లడించాయని వై నెట్ మీడియా ఓ కథనంలో పేర్కొంది. గాజాలోని స్మగ్లింగ్ ముఠా సమర్‌ను రఫా బార్డర్ గుండా ఈజిప్టులోకి చేర్చిందని వై నెట్ పేర్కొంది. సాధారణంగా ఇలా మనుషులను అక్రమంగా సరిహద్దులు దాటించేందుకు స్మగ్లింగ్ ముఠాలు పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తాయని తెలిపింది. దీంతో, ఆమె గురించిన వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇక, సమర్.. సిన్వర్‌ను 2011లో వివాహం చేసుకుంది.



# వాల్‌మార్ట్‌లో కలకలం.. సినిమాను తలపించేలా..

అమెరికాలో కత్తిపోట్లు కలకలం రేపాయి. మిచిగాన్ ట్రావర్స్ సిటీలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో శనివారం రాత్రి జనంపై ఓ దుండగుడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో 11 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటన గురించి ప్రత్యక్ష సాక్షులు వివరిస్తూ.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యామని తెలిపారు. ఈ ఘటన సినిమా సన్నివేశాన్ని తలపించిందన్నారు.




# మూడో రోజూ కొనసాగిన ఘర్షణలు
## థాయ్‌లాండ్-కాంబోడియా పరస్పర ఆరోపణలు
### 33కు చేరిన మరణాల సంఖ్య.. నిరాశ్రయులైన 1.68 లక్షల మంది .. కాల్పుల విరమణకు ఒత్తిళ్లు

**సురిన్(థాయ్‌లాండ్):** థాయ్‌లాండ్, కాంబోడియా ల మధ్య సరిహద్దుల్లో ప్రారంభమైన ఘర్షణలు శనివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. కాల్పుల ఘటనల్లో ఇరు పక్షాలకు చెందిన కనీసం 33 మంది చనిపోగా, 1.68 లక్షల మధ్య నిరాశ్రయులయ్యారు. కాల్పుల విరమణకు రావాలంటూ ఇరుదేశాలపై అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదాస్పద ప్రాంతంలో గురువారం మందుపాతర పేలి ఐదుగురు థాయ్ సైనికులు చనిపోవడం ఘర్షణలకు ఆజ్యం పోసింది. శనివారం ఘర్షణలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించింది. ఇరు పక్షాలు రాకెట్లు, శతఘ్నులతో కాల్పులకు దిగాయి. ఎఫ్-16 యుద్ధ విమానాలను, డ్రోన్లను దాడులకు వినియోగించినట్లు థాయ్ ప్రభుత్వం ప్రకటించుకుంది. ఇరు దేశాలు తమ రాయబారులను వెనక్కి పిలిపించుకున్నాయి. థాయ్‌లాండ్ ఈశాన్య ప్రాంతంలోని కాంబోడియా సరిహద్దును మూసివేసింది.

**మీరంటే మీరే..**

సరిహద్దుల్లోని తమ పుర్సత్ ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాలపైకి థాయ్ సైన్యం శనివారం ఉదయం శతఘ్ని కాల్పులకు దిగిందని కాంబోడియా రక్షణ శాఖ తెలిపింది. అదేవిధంగా, తమ కోహ్ కాంగ్ ప్రావిన్స్ తీర ప్రాంతాల్లోకి థాయ్ నేవీ పడవలు ప్రవేశించాయంది. ఆ దేశం రెచ్చగొట్టేలా దురాక్రమణ చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. థాయ్ కాల్పుల్లో ఇప్పటి వరకు చనిపోయిన వారిలో ఏడుగురు పౌరులు కాగా నలుగురు సైనికులు ఉన్నారంది. కాంబోడియాలోని పౌర నివాసాలను తాము లక్ష్యంగా చేసుకున్నామంటూ చేస్తున్న ఆరోపణలను థాయ్ ప్రభుత్వం ఖండించింది. కాంబోడియా ఆర్మీ పౌరులను రక్షణ కవచాలుగా వాడుకుంటూ నివాస ప్రాంతాల్లో ఆయుధాలను మోహరిస్తోందని ఆరోపించింది. ట్రాట్ ప్రావిన్స్‌లోకి ప్రవేశించేందుకు కాంబోడియా ఆర్మీ చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టామంది.

**ఆసియాన్ చొరవను కోరిన మండలి**

థాయ్‌లాండ్ – కాంబోడియా ఉద్రిక్తతలపై హ్యూమన్ రైట్స్ వాచ్ ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, ముఖ్యంగా చిన్నారులకు హాని తలపెట్టేలా వ్యవహరించవద్దని కోరింది. సరిహద్దులు సమీపంలోని 852స్కూళ్లతోపాటు ఏడు ఆస్పత్రులను థాయ్ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా మూసివేసిందని తెలిపింది. శనివారం మరో 12 మంది చనిపోయినట్లు కాంబోడియా తెలిపింది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినివ | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 28-07-2025
ANN తెలుగు

# మ్యూజిక్ ఆన్



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణకు స్మాల్ బ్రేక్ ఇచ్చింది యూనిట్. ఈ గ్యాప్‌లో ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్స్‌పై ఫోకస్ పెట్టారట రాజమౌళి అండ్ టీమ్. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో కలిసి ఈ సినిమాలోనిపాటలు, ఆర్ఆర్ ఎలా ఉండాలన్న విషయాలపై చర్చలు జరుపుతున్నారట రాజమౌళి. ఈ చర్చలు ఓ కొలిక్కి వస్తే ఈ సినిమా మ్యూజిక్ వర్క్స్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభిస్తారట కీరవాణి. ఈ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ మూవీలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధానపాత్రల్లో నటిస్తున్నారు. మాధవన్ మరో కీలకపాత్రలో నటిస్తారని, ఈ సినిమా కథ కథనం, భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా ఉంటాయనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ వచ్చే నెలలోనే ప్రారంభం అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఆగస్టు 9న మహేశ్‌బాబు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఏదైనా వస్తే బాగుంటుందని మహేశ్‌బాబు ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి... మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆశ నెరవేరుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.



స్లిమ్‌గా కనిపించాలని కడుపు మాడ్చుకున్నా..

# రోజులో ఒక్కసారి మాత్రమే..

ఫేమస్ అవడానికి ఏదైనా చేస్తారు సినీతారలు. ఒక్కసారి పాపులర్ అయ్యాక దాన్ని కాపాడుకునేందుకు కూడా చాలా కష్టపడుతుంటారు. బాలీవుడ్ నటి ఉర్ఫీ జావెద్ కూడా అదే చేసింది. చిత్రవిచిత్ర వేషధారణతో సోషల్ మీడియాలో నిత్యం కనిపిస్తూ ఉండే ఈ బ్యూటీ.. మరింత అందంగా కనిపించాలని గతంలో లిప్ ఫిల్లర్స్ వేయించుకుంది. ఈ మధ్య వాటిని తీసేయించుకోవడానికి చాలా కష్టపడింది.

**తిండి మానేశా..**

ఆ ట్రీట్‌మెంట్ వల్ల పెదాలు, ముఖం అంతా ఉబ్బిపోయి అందవిహీనంగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే మళ్లీ మామూలు స్థితికి వచ్చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సన్నగా కనిపించాలని తిండి మానేశానని చెప్తోంది. ఉర్ఫీ జావెద్ మాట్లాడుతూ.. నేను చాలాసార్లు కడుపుమాడ్చుకునేదాన్ని. తిండి తినకపోయేదాన్ని. చాలా సన్నగా కనిపించాలని నానాతిప్పలు పడ్డాను. దీంతో నాలుగేళ్ల క్రితం నాకు బాడీ డిస్మార్ఫిక్ అనే వ్యాధి వచ్చింది.

**నాలుగు పీసులు తినేదాన్నంతే!**

(అందంగా కనిపించడం లేదేమోనని కంగారుపడటం, శరీరంలో ఏదో ఒకటి బాగోలేదని బాధపడటం వంటివి ఈ వ్యాధి లక్షణాలు) మూడు లేదా నాలుగు చికెన్ ముక్కలు తిని రోజంతా ఖాళీ కడుపుతో ఉండేదాన్ని. వర్కవుట్స్ చేయకపోయేదాన్ని కానీ పరిగెత్తేదాన్ని. ఒంట్లో ఎక్కువ శక్తి లేకపోయేసరికి మైండ్ సరిగా పనిచేసేది కాదు. ఎప్పుడూ కోపంగా ఉండేదాన్ని, చిరాకుపడేదాన్ని. ఎవరైనా నన్ను పలకరించినా సరే నాతో ఎందుకు మాట్లాడుతున్నావ్? అనుకునేదాన్ని. .

**బక్కచిక్కిపోవాల్సిన అవసరం లేదు**

అయితే తర్వాత నా పద్ధతి మార్చుకున్నాను. మరీ బక్కచిక్కిపోయి స్లిమ్‌గా ఉండాల్సిన అవసరం లేదనుకున్నాను. ఈ మధ్యే జిమ్‌కు వెళ్లడం మొదలుపెట్టాను. బరువులు ఎత్తుతున్నాను. బాగా తింటున్నాను. కచ్చితంగా సన్నగా ఉండాల్సిందేనని ఏమాత్రం ఆలోచించట్లేదు అని చెప్పుకొచ్చింది. ఉర్ఫీ జావెద్.. బుల్లితెరపై పలు సీరియల్స్‌లో యాక్ట్ చేసింది. హిందీ బిగ్‌బాస్ ఓటీటీ తొలి సీజన్‌లో పాల్గొంది. ఫాలో కర్లో యార్ వెబ్ సిరీస్‌లో నటించింది. ఇటీవల ద ట్రైటర్స్ ఇండియా అనే షోలో పాల్గొని విజేతగా నిలిచింది.

"కూలీ' చిత్రంలో నేను చేసిన పాత్ర వ్యక్తిగతంగా, ఒక అమ్మాయిగా నాకు బాగా కనెక్ట్ అయింది. నా పాత్రలో మంచి భావోద్వేగం ఉంది. అమ్మాయిలు నా పాత్రకి బాగా కనెక్ట్ అవుతారు. ఎంటర్‌టైన్‌మెంట్, అద్భుతమైన యాక్షన్, మంచి కథ, భావోద్వేగాలున్న ఈ సినిమాని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు" అని శ్రుతీహాసన్ తెలిపారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కూలీ'. ఈ సినిమాలో నాగార్జున, ఉపేంద్ర, శ్రుతీహాసన్, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్ కీలక పాత్రలు చేశారు. కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న రిలీజ్ కానుంది. డి. సురేష్‌బాబు, 'దిల్' రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా శ్రుతీహాసన్ పంచుకున్న విశేషాలు. నేనో మ్యూజిక్ ఆల్బమ్ కోసం లోకేశ్ కనగరాజ్‌గారిని కలిశాను. ఆ ఆల్బమ్ వర్క్ జరుగుతున్నప్పుడు ఆయన సర్‌ప్రైజింగ్‌గా 'కూలీ'లోని నా పాత్ర గురించి చెప్పారు. ఆయన సినిమాలంటే డార్క్, గన్స్, యాక్షన్‌తో ముడిపడి ఉంటాయి. కానీ, 'కూలీ'లో ఆయన చెప్పిన స్ట్రాంగ్ ఉమన్ క్యారెక్టర్ నాకు నచ్చింది. ఈ చిత్రంలో సత్యరాజ్‌గారి అమ్మాయిగా కనిపిస్తాను. రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్... ఇలా చాలామంది స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం

# భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించను: శ్రుతీహాసన్

మరచిపోలేని అనుభూతి. ఇంతమంది సూపర్ స్టార్స్‌తో ఒకే సినిమాలో పని చేసే అవకాశం ప్రతి ఆర్టిస్ట్‌కి దొరకదు... నాకు దొరికింది. అందుకే 'కూలీ' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. నాన్నగారితో (కమల్‌హాసన్) ఆయనకు ఉన్న స్నేహం గురించి, అప్పటి వర్కింగ్ స్టైల్ గురించి 'కూలీ' సెట్స్‌లో చాలా విషయాలు నాతో షేర్ చేసుకున్నారు రజనీకాంత్‌గారు. ఆయనతో కలిసి పని చేయడం నా అదృష్టం. నాగార్జునగారు తొలిసారి విలన్ పాత్ర చేశారు. తెలుగు ప్రేక్షకులందరూ ఆయన పాత్ర చూసి, చాలా సర్‌ప్రైజ్ అవుతారు. ఆమిర్ ఖాన్‌గారితో పని చేయడం స్పెషల్ ఎక్స్‌పీరియన్స్. లోకేశ్ కనగరాజ్ క్లియర్ విజన్ ఉన్న డైరెక్టర్. 'కూలీ' సినిమా పూర్తిగా చూడలేదు. నా డబ్బింగ్ వెర్షన్‌తోపాటు ఇంకొన్నిపోర్షన్స్ చూశాను... చాలా అద్భుతంగా అనిపించింది. చిత్ర పరిశ్రమలో ఇన్నేళ్ల పాటు హీరోయిన్‌గా కొనసాగడానికి కారణం ప్రేక్షకుల ఆశీర్వాదమే అని భావిస్తున్నాను. నేను భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించలేదు... పనిని ఎంజాయ్ చేశాను. నాకు వచ్చిన ప్రాజెక్టుకి ఎంతవరకు న్యాయం చేయాలనే దాని మీదే నా దృష్టి ఉంటుంది. నాకు డ్రీమ్ రోల్స్ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. కానీ ఒక మ్యుజిషియన్ రోల్ చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులోనూ కొన్ని కథలు విన్నాను... త్వరలోనే నా కొత్త సినిమా ప్రకటన ఉంటుంది.





# నో చీట్ డే

ఆరోగ్యంగా ఉండటం కోసం బోలెడన్ని ఆహార నియమాలుపాటిస్తుంటారు స్టార్స్. అయితే వారంలో ఒక రోజు 'చీట్ డే' అని పెట్టుకుంటారు. ఆ రోజు మాత్రం ఆయిలీ ఫుడ్, ఐస్ క్రీమ్స్, స్వీట్స్... ఇలా అన్నీ ఫుల్లుగా లాగించేస్తారు. అయితే సమంత మాత్రం 'నో చీట్ డే' అంటున్నారు. వారం మొత్తం ఒకే డైట్‌ని ఫాలో అవుతానని పేర్కొన్నారామె. కాగా మయోసైటిస్ వ్యాధి బారిన పడిన తర్వాత సమంత ఆహారం విషయంలో మరింత స్ట్రిక్ట్‌గా ఉంటున్నారు. 'యాంటీ ఇన్‌ప్లమేటరీ డైట్'ని ఫాలో అవుతున్నారామె.

అంటే... తన శరీరానికి సరిపడేవి, సరిపడనవి ఏవో తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా తన డైట్‌ని ప్లాన్ చేసుకున్నారు. అయితే ప్రతి రోజూ ఒకే రకమైన ఆహారం ప్లాన్ చేసుకుంటారట. రోజువారీ ఆహారంలో ధాన్యాలు, మొలకలు, బెర్రీ, కోల్డ్ ప్రెస్ ఆయిల్స్, నెయ్యి, బ్రోకలీ, కాలీఫ్లవర్ వంటివి తీసుకుంటానని పేర్కొన్నారీ బ్యూటీ. "వారంలో ఒకరోజు చీట్ డే అంటూ రొటీన్ డైట్‌ని దూరం పెట్టడం నాకు ఇష్టం ఉండదు. అందుకే ప్రతిరోజూ ఒకేలా తింటాను" అని సమంత అంటున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com